# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 17 జనవరి 2023

## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



**కడప క్రైం, జనవరి 16, ప్రభాతవార్త:**
తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండగ నేపథ్యంలో దిశ పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పాల్గొని సంతోషంగా పండగ సంబరాలు జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సాహభరితంగా సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. జిల్లా ప్రజలకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలను జిల్లా ఎస్పీ తెలిపారు.

## వీరబల్లిని సందర్శించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**వీరబల్లి.జనవరి16 ప్రభాతవార్త**
వీరబల్లి మండలానికి మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. తమ అత్తగారిల్లు అయిన మండల కేంద్రకు వచ్చారు. ఆయన తన బావమరదులైన గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, గాలివీటి మురళీమోహన్‌రెడ్డి, మేనల్లుడు మదన్‌రెడ్డి కుటుంబ సభ్యులును పరామర్శించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మంత్రి తనయుడు ఎంపి మిధున్‌రెడ్డి, మండల అభివృద్ధిపై ఆరాతీసి పార్టీ నాయకులుతో చర్చించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ అమర్‌నాథరెడ్డితో వివిధ సమస్యలపైన పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపైన ఆరాతీశారు. స్నేహితులను, బంధువలును, పార్టీనాయకులకు, కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారంలోకి వస్తే.. వడ్డీతో సహా తీరుస్తాం..

### నా కర్యకర్తలను కొట్టిన అధికారులను వదలను- ఇదే పోలీసులు ఉంటారు..అధికారంలోకి వస్తే చేసిచూపిస్తా

### పీలేరులో నారా చంద్రబాబునాయుడు గర్జన



కార్యకర్తల పరామర్శ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు, ర్యాలీగా వెలుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి, చల్లాబాబులు

**పీలేరు, జనవరి 16 ప్రభాతవార్తః**
మాజీ సీఎం తెదేపా జాతీయ అధ క్షులు నారా చంద్రబాబునాయుడు సోమవారం స్తానిక సబ్‌జైలులో ఉన్న తెదేపా కార్యకర్తలను పరామర్శించడానికి వచ్చారు. ఈసందర్భంగా వివిధ జిల్లా నుంచి భారీగా తెదేపా శ్రేణులు పీలేరుకు చేరుకున్నారు. చంద్రబాబునాయుడు సుమారు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పీలేర సబ్‌జైలుకు చేరుకుని అక్కడ సుమరు 30 నిమిషాలు పాటు ఇటీవల అరెస్టు కాబడిన 8 మంది యవకులను పరామర్శించి బయటకు వచ్చే క్రమంలో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై తీవ్ర స్తాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్లలో ఫ్లెక్సీల గొడవలో 8 మంది తెదేపా కార్యకర్తలను అరెస్టు చేశారని నాన్‌బెయిలబుల్ కేసులు వారిపై బనాయించారని అన్నారు. 8 మందిలో ఒక్కరు మినహా మిగతా వారందరు మైనారిటీకి సంబందించిన వారన్నారు. అందులో ఇద్దరు యువకులు ఒకరు ఇంటర్, ఒకరు బీఎస్సీ చదువుతున్నారు. మైనారిటీ విద్యార్థులన్నారు. వారిని స్థానిక పోలీసులు సహకారంతో థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించారని తరువాత మెజిస్ట్రేట్ ముందు వారిని ప్రవేశపెట్టి పోలీసులు హింసించినట్లు చెప్తే మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు వారి అభిప్రాయం వెలబుచ్చే అధికారం ఉందని ప్రభుత్వాలు మారుతుంటాయి. ఏపార్టీ శాశ్వతం కాదు, అధికారంలో ఉండదని అన్నారు. తెదేపా నాయకులు పుట్టినరోజులు జరుపుకో కూడదా? పెట్టకూడదా? వారికి ఆహక్కు లేదా అన్నారు.వైసీపీ జెండాలు ప్రతి ఇంటిపైన ఉండాలి, తెదేపా జెండాలు ఫ్లెక్సీలు ఉండకూడదు ఇది ఎక్కడి అన్యాయం అని ప్రశ్నించారు. జనసేన పార్టీ నాయకులు రామచంద్రయాదవ్ హైకోర్టు నుంచి ఉత్తర్వు తెచ్చుకుని సదుంలో రైతు భేరి నిర్వహించాలని చూ స్తే వారి ఇంటిపై వారింటి పైకి 200 మందిని పంపి వారిని భయ భ్రాంతులకు గురిచేశారన్నారు. పుంగనూరులో తెదేపాకు అద్దెకి ఇచ్చినందుకు వారిని బెదిరించి తెదేపా కార్యాలయం లేకుండా చేశారని అన్నారు. నేను ఎక్కడికి వెళ్తే అక్కడ 30 యాక్టు అమలు చేస్తున్నారని అన్నారు. నేను పీలేరు వస్తే నాకు మైకు లేకుండా చేశారని నేను పీలేరు రాకూడదా అని ప్రశ్నించారు. అనాడు తెదేపా ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి, అతని తల్లి, చెల్లి అందరూ పాదయాత్ర చేసినా తాను అడ్డుకోలేదన్నారు. పండుగ రోజు నన్ను పీలేరు రప్పించారు. మా ప్రభుత్వం వచ్చిన తరువాత మీ వేధింపులన్నీ మేము వడ్డీతో సహా తీర్చుకుంటామని హెచ్చరించారు. రాయచోటీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. తెల్లవారి నుంచి పోలీసులు భారీగా మోహరించారు. పైకార్యక్రమంలో చంద్రబాబునాయుడుతో పాటు పీలేరు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ తెదేపా అధ్యక్షలు చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు, స్తానిక తెదేపా నాయకులు మాజీ మండలి ఛైర్మన్ షరీఫ్, ఎమ్మెల్సీ రాజసింహులు, అలియాస్ దొరబాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శివకుమార్, ఎన్టీఆర్ నఫీస్, భారీగా తెదేపా శ్రేణులు పాల్గొన్నారు. పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు పీలేరు పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నది చంద్రబాబే

### -పోలీస్‌లకు చంద్రబాబు బేసరత్తుగా క్షమాపణ చెప్పాలి

### -చంద్రబాబు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

**రాయచోటి.జనవరి16 ప్రభాతవార్త**



రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అతని అనుచరులేనని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. సోమవారం పీలేరు పర్యటనలో కార్యకర్తల పరామర్శ పేరుతో చంద్రబాబు మాట్లాడిన తీరుపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాయచోటిలో తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో తీవ్రవాదం, ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంలను అణచివేసింది తానేనని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో నక్సలిజం, ఫ్యాక్షనిజం, తీవ్రవాదం, రౌడీయిజం రాజ్యమేలిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. నక్సలిజం కారణంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒక శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు హత్యకు గురైన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. ఎందరో అధికారులను, ఎందరో ఊర్లు వదిలి బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని తల దాచుకున్న విషయం మరిచారా అంటూ నిలదీశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాంతి భద్రతలు అల్లకల్లోలంగా ఉన్న పరిస్థితుల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటిని కూకటివేళ్లతో పెకలించి ప్రజాపాలన అంటే ఏంటో చూపించారన్నారు. నాడు గుంటూరు పట్టణంలోని మైనార్టీలపైన దేశ ద్రోహం కేసు నమోదు చేయించి వారిని చిత్రహింసలకు గురి చేసిన విషయం ఈ రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయచోటి మైనార్టీలపైన నమోదయిన తప్పుడు కేసులను చట్ట ప్రకారం తొలగించే ప్రయత్నం చేస్తే కోర్టుకు వెళ్లి వాటిపై స్టే తెచ్చినది మీరు కాదా అని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనతో తనకు రాజకీయ భవిష్యత్తు లేదన్న అక్కస్సుతోనే తనకున్న కొన్ని వ్యవస్థల బలంతో శాంతి భద్రతలను క్షీణించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మరోసారి సీఎం మంత్రులపై కారు కూతలు కూస్తే చంద్రబాబు నాయుడు అసలు బండారం బయటపెడతామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగలకు ఊర్లకు వెళ్లాలని చెప్పింది నేనే, బోగిమంటలు వేసుకోవాలని నేరి ్పంది నేనే అసలు పండుగలు ఎలా చేసుకోవాలో చూపించింది నేనే అంటూ మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు నిజమైన సైకో అని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు. కులమతాలను రెచ్చగొట్టి చంద్రబాబు నాయుడు చలికాచుకుంటున్నారని ఆరోపించారు. రోజుకు 5కోట్ల రూపాయల ఖర్చుతో జడ్‌ప్లస్ కేటగిరి పోలీస్‌లతో రక్షణ పొందుతున్న మీరు పోలీస్‌ల సాయం లేకుండా ఒక్క అడుగు బయటకు వేయగలిగే ధైర్యం ఉందా అంటూ ఎమ్మెల్యే నిలదీశారు. పోలీస్‌లు ఉన్నది 60వేల మందేనని తాము తలుచుకుంటే ఏమైనా చేస్తామంటూ పోలీస్‌లపై తీవ్ర పదజాలంతో దూషించడం చంద్రబాబు అహంకారానికి పరాకాష్ట అన్నారు. శాంతి భద్రతలే పరిరక్షణగా విధులు నిర్వహిస్తున్న పోలీస్‌లకు చంద్రబాబునాయుడు క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ కోవలోనే పండుగ రోజున కూడా పీలేరు పర్యటన ఎందు చేపట్టారో ఏమి మాట్లాడదలచుకున్నారో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అర్థంకాని పరిస్థితి నెలకొంది అన్నారు. చంద్రబాబు పిలుపు, ఆపార్టీ ఆదేశాల మేరకు తరలివచ్చిన జనం కూడా బాబు మాటలు విని బాబుకు ఏమైందంటూ జుట్టు పీక్కుంటూ తిరుగు ప్రయాణం చేయడం కనిపించింది.

## సంక్రాంతి పండుగను శెట్టిపల్లిలో జరుపుకున్న మంత్రి రోజా



**సంబేపల్లి.జనవరి16 ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగ సందర్భంగా నగిరి ఎమ్మెల్యే మంత్రి రోజా మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామం తిమ్మక్కగారిపల్లి మాజీ జెడ్‌పిటిసి ఉపేందర్‌రెడ్డి స్వగృహానికి ఆదివారం విచ్చేవారు. సంక్రాంతి అనగానే రైతులు పండుగని టూరిజం శాఖ మ ంత్రి రోజా అన్నారు. మాజీ జెడ్‌పిటిసి ఉపేంద్రరెడ్డి, రమేష్ రెడ్డి, జెడ్‌పిటిసి గొర్లకవిత వారి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు సంక్షేమ మే పథకాలు అందుతూ సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. సంక్రాంతి అనగానే అందరి జీవితాల్లో చీకటిపోయి వెలుగును నింపడమే సంక్రాంతి పండుగ అన్నారు. రైతులు పెట్టిన పంటలు చేతికి అంది ధాన్యం ఇంటికి చేరిన తర్వాత వచ్చే మొదటి పండుగ సంక్రాంతి అన్నారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడం జరుగుతుందన్నారు. తిమ్మక్కగారిపల్లి మహిళలకు మగ్గులు పోటీలను నిర్వహించి బహుమతులును అందజేశారు. ప్రతి ఒక్కరు సంతోసంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. పెద్దబిడికి సర్పంచ్ వెంకటరమణ నాయక్ కోఆప్సన్ మాజీ సభ్యులు జాఫర్, ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిపెద్దిరెడ్డి, మిధున్‌రెడ్డిలకు తృటిలో తప్పిన ప్రమాదం



**రాయచోటి.జనవరి16 ప్రభాతవార్త**
గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపిమిధున్‌రెడ్డిలకు పెను ప్రమాదం తప్పింది. సోమవారం సంక్రాంతి సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం అత్తగారు నివాసానికి వెళ్తుండగా చెన్నముక్కపల్లి రింగ్ రోడ్డు వద్దకు రాగా రెండు కార్లు ఢీకొనడంతో ప్రమాదం జరిగంది. ఈ ప్రమాదంలో గన్‌మెన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ముందు కార్లో వెళ్తున్న మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డిలకు తృటిలో ప్రమాదం తప్పింది. గాయపడిన గన్‌మెన్‌లకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



## క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రానించాలి

### 50 వేలు సొంతం చేసుకొన్న కెఎస్ అగ్రహారం క్రీడాకారులు

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 16 ప్రభాతవార్త**
రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రెడ్డివారిపల్లె పంచాయతి కెసి అగ్రహారం నందు రైల్వేకోడూరు ఉప మండలాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి తనయుడు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంల కెసి అగ్రహారం నందు భారీ క్రికెట్ పోటీలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ క్రీడల్లో రైల్వేకోడూరు మండలంలోని కెసి అగ్రహారం నందు ఉన్న క్రికెట్ క్రీడాకారులు మొదటి బహుమతిని సొంతం చేసుకొన్న క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ముఖ్యంగా రైల్వేకోడూరు మండలంలో ఎంతో ఉన్నత భావాలతో క్రికెట్ క్రీడాకారులను ఉత్తేజపరిచేందుకు ప్రత్యేక క్రీడాకారుల కోసం కెసి అగ్రహారం క్రికెట్ క్రీడలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వారి క్రీడా వైభవాన్ని చూపించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ ్వజారెడ్డి దంపతులు క్రీడల్లో గెలుపొందినవారికి అత్యంత విలువైన బహుమతులను, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలో ఉన్న క్రికెట్ క్రీడాకారుల అభిమానాన్ని చూరగొని క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపడంలో ఎంతో ప్రాముఖ్యాన్ని ఇచ్చారని అదేవిధంగా వైస్ ఎంపిపి రామిరెడ్డి క్రీడలకు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేయడంలో



గెలుపొందిన క్రికెట్ క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే, వైస్‌ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి దంపతులు

క్రీడాకారులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయడంలో అభినందనీయులని అన్నారు. అనంతరం క్రీడాకారులకు మెమెంటో, 50 వేల నగదు చెక్కులను రామిరెడ్డి ధ్వజారెడ్డి దంపతులు గెలుపొందిన కెసి అగ్రహారం క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నందు ఉపసర్పంచ్ తోట శివసాయి, వైసిపి సీనియర్ నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు కొరముట్ల రాజశేఖర్, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, గోపి, రామక్రిష్ణ, వినోద్, దార్ల చంద్రశేఖర్, యజ్ఞం చంద్రశేఖర్, శివయ్య, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ముద్దలూరు సుబ్రమణ్యంరాజు, విపిఆర్ కంద్రిక సొసైటీ ఛైర్మన్ సుదర్శన్‌రాజు, కొప్పుల శంకరయ్య, వైఎస్ కరిముల్లా, వైసిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రాజంపేట ప్రజలు: మేడా

**రాజంపేట అర్బన్, జనవరి 16 ప్రభాతవార్త**
రాజంపేట నియోజకవర్గ ప్రజలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు సమైక్యంగా ఉంటారన్నారు. మత సామరస్యంతో ఎవరి పండుగలు వారు ఘనంగా నిర్వహించుకోవడంతో పాటు ఇతర మతాల పండుగల్లో, విందుల్లో పాల్గొనడం ఐక్యతకు చిహ్నమన్నారు. కనుమ పండుగను పురస్కరించుకొని రాజంపేట పట్టణంలో ముస్లిం సోదరులకు మేడా సోదరులు విందును ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులంతా స్థానిక మేడా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథ్‌రెడ్డి, నందలూరు ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, సిద్ధవటం మండల ఇన్‌ఛార్జి మేడా మధుసూదన్‌రెడ్డి, ఎపిఆర్‌డిసి డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా, మందరం వేణుగోపాల్‌రెడ్డి, వడ్డె రమణ, పసుపులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## రెండు కార్లను ఢీకోన్న లారీ : ఒకరికి విషమం 8 మందికి గాయాలు

**ఒంటిమిట్ట జనవరి16 ప్రభాతవార్త:**
మండలంలోని ఒంటిమిట్ట చెరువు కట్టా మలుపువద్ద సోమవారం సాయంత్రం రెండు కార్లను లారీ ఢీకోనడంతో 8 మందికి తీవ్ర గాయాలు ఆయ్యాయి. పులివెందులకు చెందిన వాళ్ళు తిరుమల నుంచి పులివెందులకు వేళుతుండగా కర్ణాటక రాష్ట్ర నుంచి బొగ్గు లోడుతో చెన్నైకి వెళుతూ మార్గమధ్యంలో రెండు కార్లను డీకోన్నది. ఈ సంఘటనలో సుమారు 8 మందికి తీవ్ర గాయాలు ఆయ్యాయి. ఇందులో ఒకరికి సీరియస్‌గా వున్నది. సకాలంలో ఒంటమిట్ట పోలీసులు ,హైవే పోలీసులు స్ప ందించి సంఘటనా స్థలానికి చెరుకోని 108 ద్వారా గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించారు.ట్రాఫిక్‌కు ఎలాంటి ఆంతరాయం కలుగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నరు. గాయపడిన వారిలో విజయకుమార్, శ్రీవాని, పండు, శ్రీనివాసులు, తదితరులువున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమెదు చేశారు.



## ముస్లీంల పక్షపాతి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

### ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**పీలేరు, జనవరి 16 ప్రభాతవార్తః**
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లీం పక్షపాతి అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్తానిక మార్కెట్‌యార్డు ఆవరణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫ్లెక్సీల గొడవల్లో అరెస్ట అయ్యి స్తానిక సబ్‌జైలు నందు రిమాండులో ఉన్న తెదేపా కార్యకర్తలను పరామర్శించడానికి పీలేరుకు వచ్చిన మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైన, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై, పోలీసులపైన ఉపయోగించిన పదజాలాలు అభ్యంతకరంగా ఉందన్నారు. తెదేపా అధికారంలో ఉండగా మైనారిటీలకు ఎలాంటి పదవి ఇవ్వలేదని కనీసం మైనారిటీ మంత్రి పదవి కూడ ఇవ్వకుండా తనే ఉంచుకున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనారిటీలకు అమలు చేసిన నాలుగు శాతం రిజర్వేషన్ వల్ల ఎంతో మంది మైనారిటీలు రాజకీయ ఉద్యోగ పదవులు పొందారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు అందర్నీ ఉపయోగించుకుని వదిలేస్తారని దానికి సాక్ష్యం తానేనని అన్నారు. కేవలం మతాలమధ్య చిచ్చు పెట్టేందుకు చంద్రబాబునాయుడు పీలేరు వచ్చారని అన్నారు. ప్రజలందరూ ఇదంతాగమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ తెదేపా అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీలచేసినప్పుడు, ఓడిపోతే ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. చంద్రబాబునాయుడుకు మైనారిటీల పట్ల ఉన్న వైఖరి తెలుపుతుందన్నారు. పీలేరు సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా మాట్లాడుతూ మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మైనారిటీలను కుక్కలతో పోల్చారని ఇది మైనారిటీలకు అవమానకరమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు జీవి. శ్రీనాథరెడ్డి , జడ్పీటీసీ ఏటీ రత్నశేఖర్‌రెడ్డి జిల్లా కోఆప్షన్ సభ్యులు షామియానా షఫీ, వైస్ ఎంపీపీ ఎన్‌వి.చలపతి, మాజీ సర్పంచి ఏఎస్ హుమయూన్, మహిత, మాజీ జడ్పీటీసీ జయరామచంద్రయ్య, వైసీపీ విద్యార్థివిభాగ రాష్ట్ర కార్యదర్శి సుంకర చక్రధర్ అలియాస్ చక్రి, అన్నమయ్య జిల్లా టూరిజం కౌన్సిల్ సభ్యులు ఎస్. షాకీర్, వైసీపీ నాయకులు మునీర్, షబ్బీర్, ఇంతియాజ్, వార్డు సభ్యులు ఆబిద్, హబీబ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాలు

### -కనుమ పండుగను పురష్కరించుకుని గోమాతకు ప్రత్యేక పూజలు

### -ఆలయం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పిఎస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

### -ఫిబ్రవరిలో జరగబోవు బ్రహ్మోత్సవాలు మెరుగైన ఏర్పాట్లు

### -ఫిబ్రవరి 1నుంచి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం



**రాయచోటి.జనవరి16 ప్రభాతవార్త**
శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిల సహకారం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, ఆలయ చైర్మన్ పోలంరెడ్డి విజయమ్మలు అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా కనుమ వేడుకలను అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి ఆలయం నందు మున్సిపల్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, ఆలయ చైర్మన్ పోలంరెడ్డి విజయమ్మలు ఆధ్వర్యంలో గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాతను పూజించిన యెడల సర్వపాపాలు సంహరించిపోతాయని పురాతన కాలం నుంచి ప్రతి ఒక్కరు ప్రగాడంగా విశ్వసిస్తున్నారన్నారు. పశుగ్రాసాన్ని, బెల్లం అన్నంను గోమాతకు తినిపించి అన్నమయ్య జిల్లా ప్రజలు పాడిపంటలతో, సస్యశ్యామలంగా ఉండేలా చూడాలని గోమాతను ప్రార్థించారు. ఫిబ్రవరి నెలలో జరగబోవు స్వామి వారి బ్రహ్మోత్సవాలుకు కూడా కావాల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వెండి రథాన్ని చేయించేందుకు ఏర్పాట్లు చేశామని అందుకు కావలసిన టెండర్లు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఆలయంలో నిత్య అన్నదానం జరిగేందుకు సహకరించిన దాతలకు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఫిబ్రవరి 1 నుంచి దేవాదాయ శాఖ తరపున ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి సహకరించిన దేవాదాయశాఖ కమీషనర్, కలెక్టర్ గిరీషా పిఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## వైభవంగా వెల్లాలలో పారువేట మహోత్సవం

### మహిళలు ధనుర్మాసవ్రతంను పాటించి తిరుప్పావై కీర్తనలతో గోపల్లెలో ఆహ్వానం పలకటం ప్రత్యేకత



వెల్లాల, గోపల్లెగ్రామంలో మహిళలు ప్రత్యేక ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

రాజుపాళెం, జనవరి16, ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో ఆదివారం మకర సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకొని మూలవిరాట శ్రీచెన్నకేశవస్వామి శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీహనుంత్ వాహనంపైన, శ్రీ భీమలింగేశ్వర స్వామి గంగా, పార్వతి దేవి సమేతంగా నంది వాహనం పైన పారువేట ఉత్సవం ఆలయకమిటి చేర్మేన్ కానాల విజయలక్ష్మి,ఇ.ఓ నరసయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, సర్పంచ్ రాధా, వెంకటరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చేర్మేన్ డి.సూర్యనారాయణరెడ్డి, బలరామిరెడ్డి, శంకరరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రంగా రెడ్డి తదితరులు ఉత్సవం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. గోపల్లె గ్రామంలో ధనుర్మాస వ్రతంను ఆచరించిన మహిళలు తిరుప్పావై కీర్తనలు ఆలపిస్తూ స్వామి వారికి ప్రత్యే పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యురాలు అంజనీకుమారి, మాజీ ఆలయకమిటి చేర్మేన్‌లు జి.యల్ నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, పట్టాభిసీతామిరెడ్డి, వెంకట రామిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పారువేట ఉత్సవం వెల్లాల, గోపల్లె, మల్లేమల, దద్దనాల, పగిడేల, కుమ్మరపల్లె, పర్లపాడు గ్రామలలో నిర్వ హించారు. యస్ఐ రాజగోపాల్, ఏయస్ఐ సుబ్బారెడ్డిలు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**టంగుటూరులో ఘనంగా పారువేట ఉత్సవం**

మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో సోమవారం మకర సంక్రాంతి పండుగను పరష్కరించెకొని కనుమ రోజు శ్రీలక్ష్మీమధనగోపాలస్వామి, శ్రీసోమేశ్వరస్వామి పారువేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

## విద్యార్థిని అదృశ్యం

రామసముద్రం, జనవరి 16 ప్రభాతవార్త:



మండలంలోని ఊలపాడు గ్రామానికి చెందిన కనగాని శ్రీనివాసులు కుమార్తె గాయత్రి పుంగనూరు ఎంసివి కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ప్రతిరోజూ ఉదయం కళాశాలకు వెళ్ళి సాయంత్రం ఇంటికి వచ్చేది. ఇదే క్రమంలో ఈనెల 12న ఉదయం వెళ్ళిన విద్యార్థిని కళాశాలనుంచి బయలుదేరి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి దండ్రులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సారా విక్రేత అరెస్టు

మదనపల్లెక్రైం, జనవరి 16 ప్రభాతవార్త:

సారా విక్రేతను అరెస్టు చేసి అతని నుంచి ఐదులీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. మండలంలోని నారామాకుల తాండాకు చెందిన బాలాజినాయక్ ఆదివారం మదనపల్లె పట్టణం లోని ఎన్‌విఆర్ కళ్యాణమండపం సమీపంలో సారా విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందలుఓ బాలాజీని అరెస్టుచేసి సారాస్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లెక్రైం, జనవరి 16 ప్రభాతవార్త:

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నంకు యత్నించారు. పట్టణంలోని బికెపల్లికు చెందిన జబీవుల్లా(22) భవన కార్మికుడు. ఈ నేపథ్యంలో ఇతని భార్య నాజియాతబసుమ్ ఇటీవల పుట్టింటికి వెళ్ళింది. అయితే ఆమె కాపురానికి రాకపోవడంతో మనస్థాపం చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పుంగనూరు మండలం కుమ్మరకుంట గ్రామానికి చెందిన మునిరామయ్య(40) ట్రాక్టర్ డ్రైవర్ ఈ క్రమంలో కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది గుళికలు మందుతిని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు బాధితులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## టిడిపి కార్యకర్తలకు పరామర్శ

కురబలకోట, జనవరి 16 ప్రభాతవార్త:



పీలేరు సబ్‌జైలు ఉన్న టిడిపి కార్యకర్తలను సోమవారం టిడిపి అధి నాయకులతో పాటు రాజంపేట బిసిసెల్ టిడిపి అధ్యక్షులు సురేంద్రయాదవ్ పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు. పుంగనూరు నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పీలేరు సబ్‌జైలులో ఉన్నారు. వారిని జాతీయ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర నాయకులు శ్రీనివాసులురెడ్డి, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి పరామర్శించేందుకు వెళ్ళగా వారివెంట బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ పాల్గొని పరామర్శించారు. ఈ సందర్భంగా ఇలాంటి కేసులకు టిడిపి నాయ కులు, కార్యకర్తలు బెదిరే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, మదన పల్లె, పీలేరు నాయకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అపూర్వ కలయిక

కేవి.పల్లె, జనవరి 16 ప్రభాతవార్తః



కేవి.పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరాది పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. సమావేశానికి అప్పటి హెచ్‌ఎం రామ చంద్రారెడ్డి, అధ క్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో 30 సంవత్సరాలు తరువాత కలిసిన సందర్భంగా వారి వారి అభిరుచులు గురించి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లా డుతూ విద్యను ఎవరు తస్కరించలేరని చదువుకున్న ప్రతి ఒక్కరు సమాజానికి సేవ చేసే దక్పథం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం విద్యావంతులైన ఎక్కడో సుదూర ప్రాంతాలలో ఉన్న సొంత ఊరిని మరచి పోకుండా ఎంతోకొంత ప్రజ లకు సేవచేసే హదయం కలిగి ఉండాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి రామ కష్ణ, వెంకటయ్య, రామాం జులు, భాస్కర, మునిరత్నంరెడ్డి, హరినాధరెడ్డి, వెంకటరమణారెడ్డి, వేమనాధ రెడ్డి, రామమూర్తి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పోరుమామిళ్ళ రూరల్, జనవరి 16 ప్రభాతవార్త :



1989-90 విద్యా సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1989 -90 విద్యా సంవత్సరంలో మొత్తము 100 విద్యార్థులకు గాను ఈ కార్యక్రమానికి 70 మంది పూర్వ విద్యార్థులు ఆనందోత్సవాలతో పాల్గొన్నారు. 33 ఏళ్ల క్రితం చదువుకున్న రోజులు వారు చేసిన అల్లరి, ఆటల పాటలు ,తమ స్నేహితులతో కలిసి ఆనందంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత స్థానం లో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థి వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## ఉప సర్పంచి రామమూర్తి మృతి

వాల్మీకిపురం, జనవరి 16 ప్రభాతవార్తః



మండలంలోని మాధవరంపల్లె ఉప సర్పంచి చీల రామమూర్తి ప్రమా దానికి గురై మృతి చెందాడు. మండలంలోని అయ్యావారిపల్లె పంచాయతీ చిన్నగంగు వారి పల్లెకు చెందిన వైసీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి తల్లి మిట్టపల్లె సరోజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి మృతుల స్వగహానికి చేరుకుని మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు నీళ్ల భాస్కర్, సర్పంచి జయచంద్ర, నరసింహారెడ్డి, విశ్వనాధరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వల్లి, రాజన్న, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా కనుమ పండుగ

వాల్మీకిపురం, జనవరి 16 ప్రభాతవార్తః



మండలంలోని కూరపర్తి, చింతపర్తి, గండబోయినపల్లె, నగిరిమడుగు, ఓబులంపల్లె గ్రామాల్లో సోమవారం రైతులు కనుమ పండుగను నిర్ వహించారు. అంతకు ముందు సోమవారం ఉదయం నుంచే పశువులకు స్నానం చేయించి, విశేషంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ పశువులను బెదిరించి ఆపై గ్రామ శివారులో వేసిన చిట్లాకుప్ప వద్ద ఉన్న కాటమరాజుకు విశేష పూజలు నిర్వహించారు. శాస్రోక్త_ంగా చిట్లాకుప్పల చుట్టూ పశువులను ప్రదక్షణలు చేయించి ఆపై కుప్పకు అగ్గిపెట్టి కనుమ పండుగ ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఖనిజాబివద్ధి శాఖ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కేవి.పల్లె, జనవరి 16 ప్రభాతవార్తః



గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేయాలని ఏపీజీవై ఎస్ఎస్ అనుబంధ సంస్థ వెన్నెల కంటి రాఘవయ్య గిరిజన యానాదుల ఆశయ సాధనకు సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దాలి ఇజ్రాయేలు అన్నారు. బుధ వారం స్థానిక మండలం గోరంట్లపల్లె గ్రామం కంబిరెడ్డిగారిపల్లె ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజా సంకల్పయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన దేశంలోని దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న గిరిజనులు ఇంకా దీన స్థితికి చేరుకోవడమే కాక, రాష్ట్రంలో ఉన్న 35 గిరిజన తెగలు అంతరించి పోయే ప్రమాదం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానది సంఘ రాష్ట్ర కోశాధికారి రెడ్డెప్ప, సిద్దయ్య, రాఘవయ్య, రామలింగయ్య, పోలయ్య, సంజీవరావు, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు, మహిళా సభ్యురాలు రాచూరి గౌరీ పాల్గొన్నారు.

## వైభవంగా కనుమ పండుగ

పీలేరు,జనవరి 16 ప్రభాతవార్తః



మండలంలోని కామాటంపల్లెలో సోమవారం రైతులు కనుమ పండుగను నిర్వహించారు. ఉదయం నుంచే పశువులకు స్నానం చేయించి, విశేషంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ పశువులను బెదిరించి ఆపై గ్రామ శివారులో వేసిన చిట్లాకుప్ప వద్ద ఉన్న కాటమరాజుకు విశేష పూజలు నిర్వహించారు. శాస్రోక్తంగా చిట్లాకుప్పల చుట్టూ పశువులను ప్రదక్షణలు చేయించి ఆపై కుప్పకు అగ్గిపెట్టి కనుమ పండుగ ఘనంగా జరుపుకున్నారు. పశువుల అలంకరణలో మెదటి, ద్వితీయ బహుమతులు కమిటీ సభ్యులు అంద జేశారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సలావుద్దీన్

కడప వైద్యవిభాగం, జనవరి 16, ప్రభాతవార్త:



కడప నగరంలోని హరి టవర్స్‌లో టీడీపీ సీనియర్ నాయకులు హరిప్రసాద్ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ హరిప్రసాద్‌ను సన్మానించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ పండగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ముస్లిం ఐక్య వేదిక నగర అధ్యక్షులు జమీర్, ముస్లిం ఐక్య వేదిక నాయకులు షేక్ ఖాజా, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీకగా ఆత్మీయ విందు

కడప వైద్యవిభాగం, జనవరి 16, ప్రభాతవార్త:



మత సామరస్యానికి ప్రతీక అయిన కడపలో ఒకరి పండగలను ఒకరు గౌరవించుకోవడం, విందు భోజనాలు పాల్గొనడం సంతోషదాయకమని టీడీపీ కార్య వర్గ కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం హరిటవర్స్‌లో ముస్లింలను ప్రముఖులను పార్టీలకు అతీతంగా హరిప్రసాద్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సంక్రాంతికి విందు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కులమతాలకతీతంగా పాల్గొని విందు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. హాజరై తన ఆతిథ్యాన్ని స్వీకరించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

చాపాడు జనవరి 16, ప్రభాతవార్త



మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని చియ్యపాడు గ్రామమునందు. శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి సంక్రాంతి ఉత్సవాలులో భాగంగా భోగి పండుగ నుండి కనుమ వరకు వివిధ క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలుఅంగరంగ వైభవంగా నిర్వహించారు. మకర సంక్రాంతి సందర్భంగా పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి. (పివిఆర్ఆర్) కాత్యాయని కన్స్ట్రక్షన్ అధినేత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురాంరెడ్డితో పాటు వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగం రెడ్డి తిరుపాల్రెడ్డి హాజరై స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అర్చకులు దేవస్థాన చైర్మన్ .ఎం. నిరంజన్ రెడ్డి వేదమంత్రాలతో. పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం వెంకట రమణారెడ్డి. ముఖ్య అతిథులను పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ ఆర్ కె ఆర్ట్రస్ట్ చైర్మన్ ఇరగం రెడ్డి కార్తీక్ రెడ్డి చెన్నకేశవ స్వామి దేవస్థానం అభివృద్ధికి రెండు లక్షల రూపాయలతో పాటు.సినిమా ప్రొడ్యూసర్ వెలిచెర్ల ప్రదీప్ కుమార్ లక్షరూపాయలు కలిపి. దేవస్థానమునకు నగదు అందజేశారు. ఎదురూరు గ్రామం నందు పార్వతి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానం నందు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం బండ లాగుడు పోటీ కార్యక్రమానికి మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి మండల అధ్యక్షులు లక్ష్మయ్య. జెడ్పిటిసి భర్త శాంతరాజు. స్థానిక నాయకులు హాజరయ్యారు. సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించి సంక్రాంతి ఉత్సవాలను విజయవంతంగా ముగింపు పలికారు.

## మండలంలో సంక్రాంతి వేడుకలు

పెద్దతిప్ప సముద్రం 16, ప్రభాతవార్త



తెలుగు సాంప్రదాయ సంక్రాంతి సంబరాలు పిటిఎం మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. ప్రతి ఏటా జరిగే తెలుగు వారికి అత్యంత ప్రాధాన్యమైన సంక్రాంతి పండుగలో మొదటిదైన భోగి పండుగను పిటిఎం మండలంలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. అదేవిధంగా మకర సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో ప్రజలు కొత్త వస్త్రాలు ధరించి సాంప్రదాయ పద్ధతి ప్రకారం దేవాలయాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం కనుమ పండుగను పునస్కరించుకొని గ్రామాల్లో ఉన్న ఆవులను వివిధ రంగు రంగుల రిబ్బన్లతో శృంగారంగా తయారు చేసి తమ ఆవులతో ఊరేగింపు నిర్వహించారు.

## ప్రమాదంలో కర్ణాటక వాసి దుర్మరణం

పెద్దతిప్ప సముద్రం 16, ప్రభాతవార్త

ఇసుక టిప్పర్ లారీ బోల్తా పడి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తి దుర్మరణం జరిగిన ఘటన పిటిఎం మండలంలో చోటుచేసుకుంది. ఆదివారం రోజున ఉదయం 8:30 సమయంలో పిటిఎం మండలంలోని చెన్న రాయిని పల్లి గ్రామం సమీపాన గల రోడ్డు టర్నింగ్ వద్ద ఇసుక టిప్పర్ లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది అంతలోనే ద్విచక్ర వాహనంలో వస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన కోలార్ జిల్లా చిల్లరపల్లి కు చెందిన వి. మల్లికార్జున 36. వయసు గల వ్యక్తి టిప్పర్ లారీ కింద తన బైకుతో పాటు పడి దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే తీవ్రంగా గాయపడ్డ మల్లికార్జున కు చికిత్స నిమిత్తం బి కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అతని పరిస్థితి విషమించడంతో వెంటనే మరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పిటిఎం ఎస్ఐ మధురామ చంద్రుడు తెలిపారు. అయితే ప్రమాదం జరిగిన సంఘటనా స్థలానికి ఎస్ఐ మధురామ చంద్రుడు చేరుకొని ప్రమాదానికి గురైన కారణాలపై ఆరా తీశారు అనంతరం మృతుని తండ్రి వెంకట రెడ్డి పిరయధ్ మేరకు ట్రిప్పర్ లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దురాప్తి చేపట్టినట్లు ఎస్సై మధు రామచంద్రుడు తెలిపారు.

## అనంతరాజుపేటను అభివృద్ధిపథంలో నడిపిద్దాం

రైల్వేకోడూరు రూరల్, జనవరి 16 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతిని రానున్న రోజుల్లో ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ప్రభుత్వ సలహాదారు రక్షాసి ధనుంజయ్యరెడ్డి ఆధ్వర్యంలో అనంతరాజుపేట పంచాయతిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శ్రీకారం చుడుతున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు రైల్వే కోడూరు మండలంలోని అనంతరాజుపేట మేజర్ పంచాయతిలో 2 పంచాయతిలు పని చేస్తున్నాయని, జనాభా దృష్ట్యా 3వ పంచాయతిని ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధుల సహకారంతో ఏర్పాటు చేస్తామని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ, బిజెపి, జనసేన ఏకమైనా రల్వేకోడూరు నియోజకవర్గాన్ని గెలిపించి ముఖ్యమంత్రికి బహుమానంగా అందజేస్తామని పంజం సందీప్‌రెడ్డి అన్నారు. అనంతరం పంజం సందీప్‌రెడ్డిని వైసిపి అభిమానులు పార్టీలకతీతంగా పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పంజం విజయరంగా రెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి, బండారుమల్లి, రామచంద్రారెడ్డి, నరసింములు, కుమార్‌రెడ్డి, వినోద్, రామచంద్రయ్య, బజ్జీ, బత్తిన శశికుమార్‌రెడ్డి, సిద్దయ్య, నాగరాజు, మల్లికార్జున, వినోద్, రాజనాల చంద్ర పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సంక్రాంతి ఉత్సవాలు

బద్వేలు రూరల్, జనవరి 16 ప్రభాతవార్త :



మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో మొదటి రోజు నుండే సంక్రాంతి ఉత్సవాలు కన్నుల పండువగా వైభవో పేతంగా వైఎస్సార్ సీపీ కడప జిల్లా యువజన విభాగం వింగ్ నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంక్రాంతి కానుకగా ముగ్గుల పోటీలను నిర్వహిం చడంతో గ్రామ ప్రజలలో ఉత్సాహ భరిత ప్రోత్సాహంతో ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారికి, న్యాయ నిర్ణేతలకు ఘనంగా వైఎస్సార్ సీపీ నాయకులు, జిల్లా యువజన విభాగం వింగ్ నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డితో పాటు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సత్కరించారు. రంగవల్లుల పోటీలలో న్యాయ నిర్ణేతలుగా పబ్బతి శ్రీదేవి, పూనిపర్తి ఉమా, పత్తి పుష్పలత సుమారు అరగంటకు పైగా రంగవల్లులను పరిశీలించి ఒక నిర్ణయానికి రావడంతో గ్రామస్తులు అభిప్రాయాల ఏకీభావంతో మొదటి, రెండవ, మూడవ బహుమతులను న్యాయ నిర్ణేతల చేతుల మీదుగా గ్రామ ప్రజలు అభినందిస్తూ గ్రామ ప్రజల ప్రోత్సాహంతో తోశాలువాతో సత్కరించి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెళ్ళ పద్మావతి, ఉప సర్పంచ్ రవి కుమార్‌రెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు వేణు గోపాల్ యాదవ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

బద్వేలు రూరల్, జనవరి 16 ప్రభాతవార్త :

తెలుగువారి మొదటి పండుగ సంక్రాంతిని గ్రామాలలో వైభవోపేతంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుం దని, ఈ పండుగను ప్రజలందరూ వైభ వంగా జరుపుకుంటారని శ్రీశ్రీశ్రీ దప్పి లేశ్వరి అమ్మవారి సన్నిధిలో విచ్చేసిన భక్తులను చూస్తే అర్థమవుతుందని శ్రీ సాయి వసుధ ట్రస్ట్ ఛైర్మెన్ సొదరి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శ్రీ సాయి వసుధ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొదటి రోజు నుండే అమ్మవారికి ప్రత్యేక పొంగళ్ళు సంక్రాంతి రోజు ముగ్గుల పోటీల కార్యక్రమంతో పాటు కనుమ పండుగ నాడు అమ్మవారి ప్రత్యేక దర్శనంతో భక్తులు కిటకిటలాడారని వివరించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి వసుధ ట్రస్ట్ ఛైర్మెన్ సొదరి వెంకట సుబ్బారెడ్డి, లీగల్ అడ్వైజర్ కృష్ణ మాట్లాడుతూ వేకువజాము నుండే 3 రోజుల నుండి అమ్మవారికి ప్రత్యేక పాలాభిషేకంతో పాటు విశేష పూజలు, అభిషేకాలు, హోమ, యజ్ఞా చేశారన్నారు. కార్యక్రమంలో శ్రీ సాయి వసుధ ట్రస్ట్ మేనేజర్ ఆరీఫ్ బాష, అర్చకులు రామకృష్ణ స్వామి, రామసుబ్బారావు, నిమ్మకాయల రామకృష్ణ స్వామి, నిమ్మ కాయల రామచంద్రారెడ్డి, బ్రహ్మంగారి మఠం డా॥ శీలం బాల గౌడ్, భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయా కర్పూరం సమర్పించుకున్నారు.

## సంక్రాంతి సంబరాలు

చిన్నమండెం.జనవరి16 ప్రభాతవార్త



మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి పండుగ సంబరాలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో బందు వులు, కొత్త దంపతులతో సందడి నెలకొంది. మూడు రోజులు పాటు జరిగే ఈ పండుగకు వివిధ ప్రాంతాలలో వ్యాపార, ఉద్యోగరిత్యా ఉన్నవారు తమ సొంత గ్రామాలకు చేరుకున్నారు. ఇండ్ల ముందు ముగ్గులు వేసి బోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. పిండి వంటలు చేసుకుని నూతన వస్త్రాలు ధరించి పండుగను ఘనంగా నిర్వ హించారు. కనుమ రోజు పశువులను అత్యంత సుందరంగా అలంకరించి కొమ్ములకు బెలూన్లు కట్టి ఊరు సమీపంలో ఏర్పాటు చేసే చిట్లాకుప్ప వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి కుప్పకు అగ్గిపెట్టి కుప్ప చుట్టు పశువులను ప్రదక్షణ చేయించారు.



సంక్రాంతి సంబరాల సందర్భంగా బద్వేలులో ముగ్గులు వేస్తున్న ఉమా గాయత్రి

## సంస్కృతి, సంప్రదాయాల ఐక్యతే సంక్రాంతి

బ్రహ్మంగారి మఠం, జనవరి 16 ప్రభాతవార్త :



సంస్కృతి, సంప్రదాయాల ఐక్యతకు నిదర్శనం సంక్రాంతి పండుగ అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రవీంద్రనగర్‌లో సంక్రాంతి కనుమ పండుగను పురస్కరించుకొని మహిళలతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను పెద్దల చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువతను క్రీడలలో ప్రోత్సహించే విధంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నర సింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎద్దు రాహుల్, అధ్యక్ష, కార్య దర్శులు కలివెల రాజశేఖర్, యర్రంపల్లె అజయ్, సహాయ కార్యదర్శి అల్లూరి సందీప్, కమిటీ సభ్యులు సన్ని, పవన్ పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిని కలిసిన బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి.జనవరి16 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం అత్తగారి నివాసానికి వచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తున్న గౌరవ మంత్రి వర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిధున్ రెడ్డిలను రాయచోటి పట్టణ శివార్లులోని రింగ్‌రోడ్డు నందు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఫయాజుర్‌రెహామాన్, కౌన్సిలర్‌లు అన్నా సలీం ఇతర వైకాపా నాయకులతో కలసి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్‌ఖాన్ గౌరవప్రదంగా కలిశారు.

## సంక్రాంతి విందులో పాల్గొన్న మైనార్టీ నాయకులు

రాయచోటి.జనవరి16 ప్రభాతవార్త



సంక్రాంతి సంబరాలలో భాగంగా కనుమ రోజున అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామం ఏపి ఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపిపిల జిల్లా అధ్యక్షులు మద్దిరేవులు సుదర్శన్‌రెడ్డి రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన ఆరం బ్రదర్స్ ఇచ్చిన విందు కార్యక్రమాలలో వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్‌ఖాన్, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, కౌన్సిలర్ అన్నాసలీం, వైకాపా నాయకులు అజంతుల్లా, కొత్తపల్లి ఇంతియాజ్, విద్యుత్ ఏఈ పీరా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి సిఎం అయిన తర్వాత రాయచోటి నియోజకవర్గం వ్యాప్తంగా అర్హులయిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతోనే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. ఈ సంక్రాంతి మాదిరే వచ్చే సంక్రాంతికి అందరూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

## ఘనంగా కనుమ పండుగ

రామాపురం.జనవరి16 ప్రభాతవార్త



మండలంలోని 13 గ్రామ పంచా యతీలలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం కనుమ పండుగను ఘనంగా కనుమ పండుగ ఆనంద ఉత్సాహం మద్య ప్రజలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న పశువులను సుందరంగా అలంకరించి గ్రామ పొలిమేర వద్ద కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసం ఉన్న కొందరు మహిళలు చిట్లకుప్ప దగ్గర మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు మహిళలు యువతి యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు

చిన్నమండెం.జనవరి16 ప్రభాతవార్త



మండలంలోని చినర్సుపల్లి గ్రామం పీరయ్య మఠంలో 217 సంవత్సరాల క్రితం సజీవ సమాధి అయిన మహిమా న్వితుడు పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఆది, సోమవారం రెండు రోజులు పాటు నాలుగవ పీఠాధిపతి నాగలింగమయ్య ఆద్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పుష్పాలం కరణ, అఖండ భజన, రాత్రి సాసవల చిన్నమ్మ కథ, పీరయ్య స్వామి చరిత్ర సంగీతగాన లహరి భక్తులను అలరించాయి. సోమవారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు నిర్వహించారు. రావి, వేప కలిసిఉన్న చెట్టులో జెండాను ప్రతిష్టించారు. పీరయ్య స్వామి మొదటిసారి హిందూ, ముస్లీం సోదరులు ఐక్యతను నిదర్శనంగా ఈ జెండాను ప్రతిష్టించారు. అప్పటినుంచి వారి వారసులు అనాదిగా ఈ కార్యక్రమాన్ని భక్తితో నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆరాధనోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పీరయ్య స్వామిని దర్శించుకుని తరలించారు.

## క్రికెట్ విజేతలకు బహుమతి ప్రదానం

వీరబల్లి.జనవరి16 ప్రభాతవార్త



మండలంలో జనవరి నెల 2వ తేదీ నుంచి ప్రారంభమయిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు స్థానిక మండల వైసిపి నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాధరెడ్డి మండల యువ నాయకులు విజయ సాగర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రతి ఏటా వారసత్వంగా వస్తున్న మండల క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాధరెడ్డి పేరు మీద నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో దాదాపు 48 టీమ్‌లు పాల్గొనడం జరిగింది. ఫైనల్‌లో కేయంపల్లి నగిరి జట్లు తలపడ్డాయి. కేయం పల్లిపై ఫైనల్‌లో నగిరి జట్టు విజయం సాధించింది. విన్నర్స్‌కు 20వేల రూపాయలు, రన్నర్స్‌కు 15వేల రూపాయలు అందజేశారు. అనంతరం గెలుపొందిన జట్లకు మెమెంటోలతో పాటు మెడల్స్‌ను ప్రదానం చేశారు. మండల ఎంపిపి గాలివీటి రాజేంద్రనాధరెడ్డి, రాజంపేట ఎన్నారై కేకే రెడ్డి, యువనాయకులు మదన్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వాలీబాల్ విజేత రైల్వేకోడూరు

గాలివీడు.జనవరి16 ప్రభాతవార్త



మండలంలోని గోరాన్ చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లిలో కరమిరెడ్డి బొజ్జమ్మ జ్ఞాపకార్ధం నిర్వహిస్తున్న వాలీ బాల్ పోటీలు సోమవారం ముగి శాయి. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు జట్టు విజేతగా నిలవగా రెండో స్థానంలో గాలివీడు మండలం కరిమిరెడ్డిగారిపల్లి జట్టు, మూడో స్థానంలో పీలేరు జట్టు నిలిచాయి. విజేతలకు ట్రోపి నగదు ప్రోత్సాహకాలను కరిమిరెడ్డి చిన్న గంగిరెడ్డి, కుమార్‌రెడ్డిలు అందజేశారు. విజేత గా నిలిచిన రైల్వేకోడూరు జట్టు కేప్టెన్ కరీముల్లాకు 30వేల నగదు, మెమెంటోను, ద్వితీయస్థానంలో నిలిచిన కరిమిరెడ్డిగారిపల్లి జట్టుకు 20వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన పీలేరు జట్టుకు 10వేల నగదు మెమెంటోలను అందజేశారు. బహుమతులు ప్రధానోత్సవంలో కరిమిరెడ్డి బొజ్జమ్మ కుటుంబ సభ్యులు, మాజీ ఎంపిటిసి సభ్యులు రెడ్డిప్రసాద్‌రెడ్డి, కడప చైతన్య విద్యాసంస్థల ఏజిఎం రమణ, అనంతపురం నారాయణ విద్యాసంస్థల ఏజిఎం రమేష్, ఆనంద్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, బయారెడ్డి, ఈశ్వరయ్య, గ్రామస్థులు, స్థానిక క్రీడాకారులు, మండల సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు

## పొంగళ్ళతో పండుగ వేడుకలు

**మదనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త :**



సంక్రాంతి పండుగ సంబరాలను హిందువులు శుక్ర, శని, ఆదివారం మూడురోజులు పాటు ఘనంగా జరుపుకొన్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో వేకువ జామునే ఆడపడుచులు ఇంటి ముందు గొబ్బెమ్మలు పెట్టి రంగురంగుల ముగ్గులను వేశారు. ఉపవాసాలు ఉండి పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం వేకువజామున బోగిమంటలు వేసుకొన్నారు. శనివారం ఉపవాసాలతో ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించారు. అదే రోజు మహిళలు ప్రత్యేకంగా పొయ్యిలు ఏర్పాటు చేసి పాలు పొంగించి తీపి పొంగళ్ళు చేశారు. పొంగళ్ళను అందరికి పంచిపెట్టారు. పలు రకాల పిండి వంటలను వండి ఆరగించారు. ఆదివారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. పశువులను రంగులతో కొమ్ములను అలంకరించి, బుడ్డలు కట్టారు. గ్రామం పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్ళారు. సాయంత్రం కాటం రాజు గుడికి తీసుకెళ్ళి అక్కడ చిట్లాకుప్పలు వేసి రగులుతున్న అగ్గి చుట్టూ ఆవులను తిప్పారు. స్థానిక పూజారులు హాజరైన వారికి ప్రసాదాలు పంచి పెట్టారు. ఆవులు, ఎద్దులు రోగాలు రాకుండా తీర్థాలు, వేపపిండితో తయారు చేసిన అన్నం ముద్దను పంచిపెట్టారు. మహిళలు గొబ్బియాల్లో..గొబ్బియాల్లో అంటూ ఇంటింటా వెళ్ళి దానధర్మాలు చేయాలని పాటలు పాడారు. దూడూ బసవన్నను అక్కడక్కడా తిప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో పలుచోట్ల రహస్యంగా కోడి పందాలను నిర్వహించారు. కొండలు, గుట్టలు, గట్లు ప్రాంతాల్లో రహస్యంగా పందాలను నిర్వాహకులు నిర్వహించారు.

# పండుగనాడు ఉచిత సరకులు పంపిణీ

**పుల్లంపేట, జనవరి 16 ప్రభాతవార్త**



పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామ పంచాయతిలో కనుమ పండుగ రోజున వంట సరకులను ఈడిగపల్లె అరుంధతివాడలో నీలి చెంగల్‌రాయుడు ట్రస్టు ద్వారా ఉచితంగా సరకులను పంపిణీ చేసినట్లు ట్రస్టు కోఆర్డినేటర్ ఈశ్వరయ్య తెలిపారు. దాదాపు 56 మందికి కనుమ పండుగ రోజు వంటలకు అవసరమైన సరకులన్ని కలిపి ప్యాకెట్ రూపంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్యతో పాటు ట్రస్టుకు చెందిన పలువురు పాల్గొనడం జరిగింది.

# సంక్రాంతిని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు

**పెనగలూరు, జనవరి 16 ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేటకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరై మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులను తిలకించారు. మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాలకు సంబంధించిన మహిళలు 106 మంది పాల్గొనగా మొదటి బహుమతి రాజేశ్వరికి 25 వేలు, ద్వితీయ బహుమతి సుజనశ్రీ 15 వేలు, అలాగే నాగాయపేటకు చెందిన రేవూరి చందు(అబ్బాయి) 10 వేల రూపాయలు కైవసం చేసుకున్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న 4 నుంచి 25 మందికి 2 వేల రూపాయలు నగదు, చీర, రవిక బహుమతులు అందజేశారు. మిగిలిన ముగ్గుల్లో పాల్గొన్న ప్రతి మహిళలకు దుస్తులు అందజేసి సత్కరించారు. మండల కేంద్రంలో జరిగిన ముగ్గుల పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. 5 మంది జడ్జిలచే ముగ్గుల పోటీలు న్యాయనిర్ణేతలుగా నిర్ణయించి ట్రస్టు సభ్యులు బహుమతులను ఎంపిక చేసి ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొండూరు అజయ్‌రెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు బిఎల్ నరసింహారెడ్డి, తహశిల్దారు శ్రీధర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, ధనుంజయ్యరెడ్డి, వైసిపి ముదిరాజ్ డైరెక్టర్ ఈశ్వరయ్య, డి.రాఘవరెడ్డి, విశ్వనాధ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాల్లో ముస్లిం సోదరులు

**నిమ్మనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త:**



కొత్త సంవత్సరం తొలిసారిగా వచ్చే పండగ సంక్రాంతి అన్నమయ్య జిల్లా మారుమూల మండలమైన నిమ్మనపల్లెలో కొత్త సంవత్సరం తొలిసారిగా వచ్చే పండగ సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయని చెప్పవచ్చు. ఆదివారం సంస్కృతి సాంప్రదాయాలకు బింధువుగా కనివిని ఎరగని రీతిలో ఓ రైతు పండగను జరుపుకొన్నారు. స్థానికంగా నివాసం ఉన్న ముస్లింలకు చెందిన పఠాన్ అన్వర్ ఖాన్ సంక్రాంతికి చేపట్టిన కార్యక్రమం పలువురిని అకర్షించింది. తమ బంధువులు గుర్రంకొండకు చెందిన రూ.2లక్షలు మతింపుచేసే దేశాయి(నాటు) ఎద్దులను తీసుకొచ్చి ఒంటిఎద్దు బండికి రూ.20వేలు మతింపు చేసే బుద్దలను ఏర్పాటు చేసి నిర్వహణను అన్వర్‌ఖాన్ కుటుంబంచే ప్రార్థనలు(నమాజ్) చేసి పసుపునీటితో దిష్టి తీయించిన తరువాత బండి ఊరేగింపుకు బయలుదేరింది. జోడి ఎద్దు ముందుగా నడవగా అలంకరించిన బండి తరువాత బయలుదేరింది. రూ.30వేలు ఖర్చుతో డిఎస్ సౌండ్‌సిస్టం ముందుగా వెలుతూ బండి నడవగా బండికి ముందర ఊరేగింపులో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. పుర వీధుల్లో ఈ వింతను చూడడానికి సందర్శకులు నిండిపోయారు. నిర్వాహకులు తమ స్వగృహంలో భారీగా అన్నదానం చేశారు.

# పీలేరుకు నిమ్మనపల్లె టిడిపి నాయకులు

**నిమ్మనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త :**



రాష్ట్ర టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటనకు నిమ్మనపల్లె నుంచి వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు బయలు దేరి వెళ్లారు. వీరంతా వర్గాలకు అతీతంగా బయలుదేరి వెళ్ళడంవిశేషం. మండల నాయకులు పార్టీ అధ్యక్షులు రమణ, రాజంపేట లోకసభ బిసి అధికార ప్రతినిధి లక్ష్మన్న, మాజీ జడ్పిటిసి వసంత మునిరత్నంలు ఉన్నారు.

# జూదగృహాలపై పోలీసులు దాడులు

**మదనపల్లెక్రైం, జనవరి 16 ప్రభాతవార్త:**

జూదగృహాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులఒ పట్టుబడిన పలవురిని అరెస్టు చేసి వారినుంచి నగదు, పందెంకోళ్ళు స్వాధీనం చేసుకొన్నారు. మదనపల్లె రూరల్ మండలం మిట్టపల్లె సమీపంలో ఆదివారం కోడిపందెం ఆడుతుండగా తాలూకా పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో 12 మందిని అరెస్టు చేసి వారినుంచి రూ.10,500 నగదు, నాలుగు కోళ్లు స్వాధీనం చేసూకన్నారు. కోళ్ళబైలు రోడ్డుల ఆడుతుండగా దాడులు నిర్వహిం చారు. 11 మందిని అరెస్టు చేసి రూ.5,500లు, నాలుగుకోళ్ళు స్వాధీనం చేసు కొన్నారు. ఎగువ కురవంకలో పేకాట ఆడుతుండగా దాడులు చేసి ఇందులో ఐదుగురిని అరెస్టు చేసి రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకొన్నారు. పట్టణంలోని బుగ్గ కాలువలో పేకాట ఆడుతుండగా వన్‌టౌన్ పోలీసలు దాడులు నిర్వహిం చారు. ఇందులో నలుగురిని అరెస్టు చేసి రూ.2,110 నగదు స్వాధీనం చేసుకొన్నారు. రామిరెడ్డి లేవుటులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.3వేలు స్వాధీనంచేసుకొన్నారు. ఈ దాడుల్లో తాలూకా సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు చంద్రశేఖర్; సుధాకర్, వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన కనుమ పండుగ..

**తంబళ్లపల్లె, జనవరి 16, ప్రభాతవార్త:**

మండలంలో సోమవారం కనుమ పండగ వైభవంగా ముగిసింది. మారుమూల ప్రాంతాల్లోని రైతులు తమ పశు వులను అలంకరించి ఊరేగింపుగా కాటమారజు వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వ హించి అనంతరం చిట్లా కుప్ప చుట్టూ పశువులను ఊరేగించి ఇండ్లకు తరలించారు. గతంలో ప్రతి ఇంటి గడపలో సేద్యపు ఎద్దులు ఉండి కనుమ పండుగ ఘనంగా నిర్వహించేవారు. అయితే నేడు పరిస్థితి భిన్నంగా మారి సేద్యపు ఎద్దులు కరవై ఏదో మొక్కుబడిగా పాడియావులకు అలంకరించి పండగ జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా మారుమూల గ్రామ సమీల్లో పండుగ సందర్భంగా కోడి పందాలు, జూదం, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టడంతో ప్రశాంతంగా పండగ జరుపుకున్నారు.

# ఎద్దుల వారి కోటలో రాష్ట్రానికి ఇదేం కర్మ

**తంబళ్లపల్లె, జనవరి 16, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్. తాండా పంచాయతీ ఎద్దులవారి కోటలో సోమవారం తెదేపా నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో నేడు పెరిగిన డీజిల్, పెట్రోలు, ఆర్టీసీ ఛార్జీలు నిత్యావసర సరుకులు, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం ఇలా పలు రకాల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాబోయే రోజుల్లో తెదేపాదేనని వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు తెదేపా నాయకులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బేరి శ్రీనివాసులు, యువత అద్యక్షుడు గంగరాజు, నియోజకవర్గం యువత కార్యదర్శి వై.మధుసూదన్, నరసింహులు, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, తేజమూర్తి నాయుడు, మ్యూజికల్ శివ, శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబుతో కలసి కార్యకర్తలను పరామర్శించిన జయరామనాయుడు

**మదనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త:**



ఇటీవల పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలంలో చోటు చేసుకొన్న ఘర్షణలో అధికార వైకాపా, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పీలేరు సబ్‌జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. ఈ నేపధ్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబునాయుడు పీలేరు సబ్‌జైలుకు వెళ్ళి ములాకత్ నిర్వహించారు. మదనపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుల శ్రీరామనేని జయరామ్‌నాయుడు సుమారు వంద వాహనాలతో పీలేరుకు వెళ్లి కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబును కలసి జైలులో ఉన్న టిడిపి కార్యకర్తలను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు రోజు రోజుకు మితీమీరిపోతున్నాయన్నారు. పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ చల్లాబాబుతో కలసి కార్యకర్తలను పరామర్శించి వారికి ధైర్యం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటరమణ, టిడిపి నాయకులు పెంచుపాడుస్వామి, ముద్దుక్రిష్ణనాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కళావేదికపై అలరించిన చిన్నారులు

**కడప కార్పొరేషన్, జనవరి 16, ప్రభాతవార్త:**



సంక్రాంతి పండగ చివరి పండగ కనుమ రోజున సోమవారం సాంస్కృతిక కళావేదికపై సాయంత్రం 5 నుంచి 8.30 గంటల వరకు చిన్నారుల జానపద నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. కామెడి సీన్లు వేసి అందరినీ నవ్వించారు. చిత్తూరు జిల్లాకు చెందిన బైరెడ్డిపల్లి కళాతరంగిణి బృందం సంక్రాంతి వచ్చిందే తుమ్మెద అనే పాటకు వీక్షకులు కేరింతలు వేశారు. ఈ సందర్భంగా పరిపాల నాధికారి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 3 రోజుల సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలతో పాటు పాటలు, నృత్యాలు అలరించాయన్నారు.

# ఎకరానికి సాగునీరు అందితే అభివృద్ధి సాధ్యం

## – ఏపీ రైతు రాజ్యం పార్టీ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్పనాయుడు

**కడప వైద్య విభాగం, జనవరి 16, ప్రభాతవార్త:**

రాయలసీమ జిల్లాల్లోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించినట్లయితే ఇక్కడి రైతుల ఆర్థిక స్థితిగతులు వారి విద్య, వైద్యం, ఆరోగ్యం, వసతి, చేనేత పరిశ్రమల ఉపాధి కల్పన జరిగి అభివృద్ధి చెందుతాయని ఏపీ రైతు రాజ్యం పార్టీ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్పనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులను ఉపయోగించి ఆయకట్టు పెంచేటట్లు ప్రభుత్వానికి నివేదికలు తయారు చేసి పంపాలని, రైతు బాగుంటనేనే దేశం బాగుంటుం దన్నారు. వ్యవసాయం బాగుంటేనే దాని మీద ఆధారపడిన అనేక రకాలైన వృత్తుల వారికి ఆర్థిక మాంద్యం తప్పుతుందన్నారు. ఐటీ మోజులో పడి వ్యవసా యాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆర్థిక మాంద్యం తప్పదన్నారు. వ్యవసాయం దండగా అనే మూర్ఖుల పాలనలో ఏమాత్రం అభివృద్ధి చెందక ఈ రోజు ఈ పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాల్లో పెట్టుబడి పెట్టి మళ్లీ దానిని సొంత వ్యాపారాల ద్వారా పరిశ్రమల ద్వారా కాంట్రాక్టర్ ద్వారా ఐదు సంవత్సరాల్లో రైతుల సంక్షేమం పట్టించుకోక వారి స్వప్రయోజనాల కోసం ఎన్నికల్లో గెలిచి ప్రజల బాగోగులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రజల సేవలో 24 గంటలు నిమగ్నమై ఉండాలని అప్పుడే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమన్నారు.

# ఎమ్మెల్యే రాచమల్లుపై బిజెపి వ్యాఖ్యలు అర్థరహితం : వైసిపి

**ప్రొద్దుటూరు జనవరి 16, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు బిజెపి నాయకులు గొర్రె శ్రీనివాసులు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు సత్యదూరమని ఇది బిజెపి నాయకులకు తగదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి ఎమ్మార్పీఎస్ స్టేట్ కన్వీనర్ సుధా కర్ మాదిగ వైసిపి నాయకులు ఎద్దుల రాయపరెడ్డి సంయుక్తంగా ఖండిం చారు. సోమవారం స్థానిక పెద్దమ్మ తల్లి దేవాలయ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గం లో ఏ రాజకీయ పార్టీతోనూ ఒప్పందం చేసుకునే పరిస్థితులలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి లేరని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో అఖండ మెజారిటీతో ఎమ్మెల్యే గెలుపు తథ్యమని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని తన సొంత 11వ వార్డులో ఎంతో డబ్బు ఖర్చు చేసిన 130 ఓట్లు కూడా సాధించలేని బిజెపి నాయకులు గొర్రె శ్రీనివాసులు ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు 2024 లో రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొర్రె శ్రీనివాసులు 10 ఓల ఓట్లు సాధిస్తే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి రాజకీయాల నుండి తప్పుకుంటారని వారు సవాల్ విసిరారు.

# కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు

**రామసముద్రం, జనవరి 16 ప్రభాతవార్త:**

రామసముద్రం మండలంలో కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 5మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. మండలంలోని చెంబకూరు పంచాయితీ టేకుపల్లె చెరువు పక్కనే ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో కోడిపందాలు ఆడుతన్నట్లు సమాచారం వచ్చిందని వెంటనే ఆ స్థావరాలపై ఎస్ఐ, సిబ్బంది వెళ్ళి దాడులు నిర్వహించి 5గురును అరెస్టు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు జూదం కూడా ఆడుతుండడంతో వారి వద్ద రూ.3200లు స్వాధీనంచేసుకొని రెండు కోడిపుంజులను స్వాదీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మహిళలకు ఆటల, ముగ్గుల పోటీలు

**కడప కార్పొరేషన్, జనవరి 16, ప్రభాతవార్త:**



భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండగను కడప నగరంలోని ప్రజలు ఘనంగా నిర్వహించారని వైకాపా నగర అధ్యక్షుడు నారపురెడ్డి సుబ్బా రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి పసుపులేటి సాయిదత్తలు పేర్కొన్నారు. పండగను పురస్కరించుకొని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి సాయిదత్త ఆధ్వర్యంలో కడప 28వ డివిజన్ పరిధిలోని బెల్లంమండి వీధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగు రంగుల రంగవల్లిలను తీర్చిదిద్దారు. చుక్కల ముగ్గుల, సంక్రాంతి గొబ్బెమ్మ ముగ్గులు, చెరుకు గడెలు పాల పొంగు, రథం ముగ్గులు ఆకర్షణీయంగా వేశారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు కూడా నిర్వహించారు. విజేతలకు వైఎస్ఆర్ కడప నగర అధ్యక్షులు నారపురెడ్డి సుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు.

# వివేకానంద స్ఫూర్తితో సమాజ సేవ..

**కడప కార్పొరేషన్, జనవరి 16, ప్రభాతవార్త:**



స్వామి వివేకానంద నుంచి ఎంతో స్ఫూర్తి పొంది సమాజ సేవ అలవాటు చేసుకోవాలని తద్వారా సమాజ నిర్మాణానికి సేవ చేయాలని బీసీ నాయకులు గోవిందు నాగరాజు అన్నారు. వివేకానంద జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా సమాజ సేవ రోజును నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గాయత్రి మహిళా స్వయం సహాయక సేవా సంఘం,నవ జీవన్ నివాస్ నిరాశ్రయుల గృహంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ పాల్గొన్నారు.

# అమ్మవారిశాలలో గోమాతకు పూజ

**కడప కార్పొరేషన్, జనవరి 16, ప్రభాతవార్త:**



టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో కనుమ పండగ (పశువుల పండగ) సోమవారం కడప అమ్మవారి శాలలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం గోపూజ మహోత్సవాన్ని నిర్వహిం చారు. సువాసీనులు మహిళలు, కన్యకలు దోమాతకు పసుపు, గంధం, కుంకుమ వేషం, గజమాలతో అందంగా గోవును అలంకరించారు. పూజారులు మంత్రోచ్చా రణల నడుమ భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు నిర్వహించారు. సమస్త దేవతలకు నిలయమైన గోమాతకు గ్రాసాన్ని తినిపించారు. గోమహాలక్ష్మి యొక్క ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీరామ్ మహేష్ గోమహాలక్ష్మి యొక్క విశిష్ట తను వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వాహకుడు గోపిబాబు, అమ్మవారిశాల కమిటీ సభ్యులు పడుచూరి వెంకటేశ్వర్లు, వెంకట నరసింహులు, చీతిరాల సాయి, రాంప్రసాద్, సుదర్శన్, సుదాకర్, గూడూరు రమేష్, మహిళా మండలి సభ్యులు ఏటూరి మాధురి, మంజుల, రేణుక, మాధవి, భజనమండలి సభ్యులు విజయ, రెడ్డమ్మ, భారతి పాల్గొన్నారు.

# 28వ డివిజన్‌లో సంక్రాంతి సంబరాలు

**కడప వైద్యవిభాగం, జనవరి 16, ప్రభాతవార్త:**



నగరంలోని 28వ డివిజన్‌లోని డివిజన్ ఇన్‌ఛార్జి రాఘవ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా తెదేపా కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీఎస్.అమీర్‌బాబు పాల్గొని స్థానిక మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కడప తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, కడప పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ బుర్రిరెడ్డి యాదవ్, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు నాసర్‌అలీ, 11వ డివిజన్ తెదేపా నాయకులు రమేష్‌బాబు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన అఫ్జల్‌ఖాన్

**కడప కార్పొరేషన్, జనవరి 16, ప్రభాతవార్త:**



కడప మారుతీనగర్, రాజారెడ్డివీధిలోని అఫ్జల్‌ఖాన్ కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను కడప నియోజకవర్గ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

# సంక్రాంతి సందడి

**కమలాపురం, జనవరి 16, ప్రభాతవార్త:**

సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలా మండలంలోని పల్లెటూళ్లన్నీ కమ్మని పిండి వంటలతో అందమైన రంగవల్లుల తో, యువత కేరింతలు, హరిదాసు కీర్తనలతో, భోగి మంటలతో, కోడి పందే లాలతో, ఎద్దుల పందేలతో గాల్లో ఎగిరే పతంగులతో కళకళలాడాయి. కమలాపురం పట్టణం శ్రీశ్రీ పాతాళ సోమేశ్వర స్వామి దేవస్థానం నుంచి పార్వతీ పరమేశ్వరులు శ్రీశ్రీ కంచి వరదరాయస్వామి దేవస్థానం నుంచి లక్ష్మీ సమేత కంచి వరదరాజస్వామి వార్లు పారువేట మహోత్సవానికి సోమవారం పారువేట ఉత్సవ స్థలంలోని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు యువకులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, పిల్లలకు లెమన్ స్పూన్, రైతులకు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కమలాపురం ఎస్సై చిన్నపెద్దయ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

# రామాపురంలో అంగరంగవైభవంగా సీతారామ కల్యాణం

## – కల్యాణోత్సవంలో కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ

**కమలాపురం, జనవరి 16, ప్రభాతవార్త:**



నిత్య కల్యాణ దేవతా మూర్తులు శ్రీ మహాలక్ష్మి మోక్ష నారాయణ స్వామి శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కొలువైన శ్రీ రామాపురం పుణ్యక్షేత్రంలో సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలం సందర్భంగా ఆదివారం సాయంత్రం సీతారామ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. శ్రీరాములవారు ఈ క్షేత్రంలో ఉత్తరాయణ పుణ్యకాలంలో నిదురిస్తున్న సమయంలో శ్రీమహావిష్ణువు శ్రీరాముల వారికి స్వప్న సాక్షాత్కారమై మోక్షాన్ని ప్రసాదించాడని 2వేల సంవత్సరాల క్రితం నాటి ఆలయం భిన్నమైన తరువాత, ఇటీవల గత 8 సంవత్సరాల కిందట ఆలయ దేవతా మూర్తుల పున: ప్రతిష్ట అనంతరం అయోధ్య నుంచి సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారు ఉత్తరాయణ పుణ్యకాలంలో రామాపురం క్షేత్రానికి ఉత్సవ విగ్రహాలుగా ఆలయం పున: ప్రతిష్ట జరిగిన మొదటి సంవత్సరం ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం సమయంలో రామాపుర క్షేత్రానికి రావడంతో అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభం రోజున సాయం సమయంలో సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా కనుల పండువగా ఈ క్షేత్రంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ప్రధాన సేవకులు కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణ నిర్వహణ ఏర్పాట్లు ఆలయ కమిటీ సేవకులు విరివిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

# రెడ్డెమ్మతల్లికి భక్తుల గోదానం

**గుర్రంకొండ జనవరి 16, ప్రభాతవార్త**



సంతాన ప్రధాయిని అయిన శ్రీ రెడ్డెమ్మ తల్లికి సంక్రాంతి పర్వదినాన ఆదివారం ఓ భక్తుడు గోదానం చేశాడు. తిరుపతికి చెందిన నవకుల భరత్‌బూషన్ కుటుంబ సభ్యులు తన జ్ఞాపకార్థం ఆలయ అర్చకులు, ఆలయ ఛైర్మన్ సమక్షంలో దానం చేశారు. ఇతను చెర్లోపల్లె నివాసి. అయితే కొన్ని సంవత్సరాల క్రితం తిరుపతిలో స్థిరపడ్డారు. అందుచే తన జ్ఞాపకార్థం గోవును ఆలయానికి దానం చేసినట్లు ఆలయన ఛైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. అనంతరం గోమాతను దానం చేసినవారికి దేవస్థాన మర్యాదలతో తీర్థప్రసాదాలు, అమ్మవారికి శేషవస్త్రాలు అందజేయడం జరిగింది.

# హజ్ హౌస్ మనుగడలోకి రావాలి

## – డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్

**కడప ఏడురోడ్లు, జనవరి 16, ప్రభాతవార్త:**



హజ్‌హౌస్‌ను ప్రభుత్వం మనుగడలోకి తీసుకురావాలని 2 సంవత్సరాలుగా నాతో పాటు సంఘ సేవకులు సలావుద్దీన్, చాలా మంది కాంగ్రెస్ నాయకులు కొన్ని స్వచ్ఛంద సంస్థలు దర్శించి పరిశీలించి ఇక్కడ సెక్యూరిటీ లేదని, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, కోట్ల రూపాయలతో కట్టిన భవనం అందులోని ఫర్నీచర్ శిథిలమైపోతున్నాయని ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్ అన్నారు. అయినా స్పందించకపోవడం బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే రవీంద్ర నాథ్‌రెడ్డి, హజ్ కమిటీ ఛైర్మన్ కడపలోనే ఉన్నారు. మైనార్టీ సంక్షేమశాఖామంత్రి కూడా ఉన్నారు. వారు తలుచుకుంటే ఇది ఏమంత పెద్ద విషయం కాదు. కానీ అనుకోకపోవడం శోఛనీయమన్నారు. నగరంలోని యువకులు ఐకమత్యంతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయండి అందరి అభిప్రాయాలను తీసుకొని అక్కడి మసీదును శుభ్రపరిచి ముందుగా మనమే జుమ్మా నమాజును ప్రారంభిద్దాం. మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్కడ వెంటనే ఒక సెక్యూరిటీ, అక్కడి మసీదుకు ఒక ఇమాం, మౌజన్ నియమించాలని కోరుదామని స్పందించక పోతే పెద్దవారి సూచనలు సలహాలతో ముందుకెళ్దామని హజ్ భవనాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

# ఏపీ మాజీ అడ్వకేట్ జనరల్‌ను సన్మానించిన రాష్ట్ర హైకోర్టు న్యాయవాది

**కడప ఏడురోడ్లు, జనవరి 16, ప్రభాతవార్త:**



కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ముజ్తాహిద్ హుసేన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఏపీ మాజీ అడ్వకేట్ జనరల్ సీవీ మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ అడ్వకేట్ జనరల్ ఆఫ్ ఏపీ మాట్లాడుతూ యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చని యువ న్యాయవాది ముజ్తాహిద్ హుసేన్ చిన్న వయసులోనే రాష్ట్ర హైకోర్టు న్యాయవాదిగా రావడం అభినందనీయమన్నారు. యువత సమాజంలో మంచి సేవలు అందించి ఉన్నత స్థానాలు పొంది మన భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు హమీద్ హుసేన్, న్యాయవాది ఏఎండీ జావీద్, రామచంద్రారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, సాదిక్ హిలాల్, రాయల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**గుర్రంకొండ, జనవరి 16, ప్రభాతవార్త**

గ్రామాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం నుండే పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ సంధర్భంగా ప్రతి ఇంటి ముందు రంగవల్లులు, బంధువులు, పశువుల అలంకరనలు ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి. మండలంలో ఎక్కువగా ఆదివారం రోజునే కాటంరాజు చుట్టూ గోవులను ప్రదక్షిన చేస్తూ బోగి మంటలను చూపించారు. అనంతరం కాటంరాజు దగ్గర వండిన ప్రసాదంను భక్తులు స్వీకరించారు. ప్రతి గ్రామంలో పొట్టేళ్ళను నడివీధి గంగమ్మకు బలి ఇవ్వడం జరిగింది. బోగి మంటలతో ప్రజల జీవితాలలో చీకట్లను పారద్రోలి వెలుగులు, సంతోషాలు నింపాలని దేవుణ్ణి వేడుకొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక సంక్రాంతి

**కడప ఏడురోడ్లు, జనవరి 16, ప్రభాతవార్త:**



సంక్రాతి పండుగను మతాల కతీతంగా అందరూ కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నా రు. కనుమ పండగ సందర్భంగా సోమవారం హరిటవర్స్‌లో ముస్లిం మైనార్టీ లకు హరిప్రసాద్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా కడప నగరంలోని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, హరిప్రసాద్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సుఖసంతోషా లతో అష్టైశ్వర్యాలు, ఆరోగ్యాలతో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. కుల మతాల కతీతంగా ప్రతి సంవత్సరం విందుకు హాజరవుతున్న ముస్లిం సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీక అన్నారు. కడప నగరంలో ఇక్కడ అన్ని పండగలు అందరూ కలిసి మెలసి జరుపుకోవడం సమైక్యతకు చిహ్నమన్నారు. కార్యక్రమంలో జేకేయూత్ సభ్యులు సలీం, హరి, పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**లక్కిరెడ్డిపల్లె, జనవరి 16, ప్రభాతవార్త:**



ఏడాదికి ఒకసారి వచ్చే సంక్రాంతి పండగ తెలుగు వారు ఆత్మీయ అను రాగాల ముంగిట హరివిల్లు విరజిల్లే సంక్రాంతి ముగ్గులు ప్రజలు ఎంతో ఆసక్తి కరంగా, ఆనందకరంగా ప్రతి పల్లెలోనూ ఉంటాయి. మూడు రోజుల పాటు ప్రతి ఇంట ప్రతి ముంగిట ముత్యాల ముగ్గులతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కనుమరోజున చిట్లా కుప్పలు గోవులను అలంకరణ ఎంతో ఆకట్టుకున్నాయి. ప్రతి పల్లెలో సంబరాలు చేసుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి

## తండ్రికి తీవ్ర గాయాలు

**కడప క్రైం, జనవరి 16, ప్రభాతవార్త:**



కడప నగరం రామకృష్ణ జూనియర్ కళాశాల సమీపంలోని బుగ్గవంక వంతెనపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెంద గా అతని తండ్రికి తీవ్ర గాయాలైనట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలి పారు. సీఐ వివరాల మేరకు కడప అశోక్‌నగర్‌కు చెందిన షేక్ నసీర్(27) సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో తండ్రి మహ్మద్ హుసేన్‌తో కలిసి వెళ్తుండగా బుగ్గవంక వంతెన వద్దకు రాగానే స్కూటరు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడిపోయారు. ఇద్దరి తలలకు గాయాలు కాగా నాసిర్ అక్కడికక్కడే దుర్మ రణం చెందారు. తీవ్ర గాయాలైన మహ్మద్ హుసేన్‌ను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : ఒక వేదికపై చేరుకున్న ఆర్యవైశ్యులు



**బద్వేలు అర్బన్, జనవరి 16 ప్రభాతవార్త :**

పట్టణంలో మొట్ట మొదటి సారిగా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటే విధంగా పట్టణంలోని ఆర్యవైశ్యులంతా ఒక వేదికపై కలిసి ఒక రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు చిన్నా, పెద్దలందరూ కలిసి మెలిసి సంక్రాంతి సంబరాలలో పాల్గొని భావితరాలకు గుర్తుండేలా సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా సంక్రాంతి వేడుకలను బద్వేలు ఆర్యవైశ్యుల అనుబంధ సంస్థలు, ఆర్యవైశ్య మహిళా మండలి, యువజన సంఘం, వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలకు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారస్తులు చిన్నా, పెద్దలందరూ కలిసి మెలిసి వేడుకలలో పాల్గొన్నారు. మొదటగా శ్రీ వెంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో రంగవల్లుల కార్యక్రమం నిర్వహించారు. పలువురు మహిళలు స్వామివారికి బెల్లం పొంగలి నైవేద్యాన్ని తయారుచేసి సంక్రాంతి పండుగకు విచ్చేసిన పలువురికి ప్రసాదంగా అందజేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. బద్వేలు పట్టణంలో మొట్ట మొదటి సారిగా సంక్రాంతి సంబరాలను కనీవినీ ఎరుగని రీతిలో చేపట్టి ఆర్యవైశ్య పెద్దలకు, పిల్లలకు, మహిళలకు మరియు బాలికలకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం కొత్తగా వివాహమైన దంపతులకు డ్యాన్స్ పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి, వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. అనంతరం 10 సంవత్సరాలలోపు పిల్లలకు బోగి పండ్లు కార్యక్రమం చేపట్టి సాయంత్రం 5 గంటలకు చిన్న పిల్లలకు గాలి పటాలు (పతంగ్) పోటీల కార్యక్రమాలు చేపట్టి, పలు క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, యువజన సంఘం అధ్యక్షులు గుబ్బా వెంకట సుబ్బయ్య, వాసవీ క్లబ్ అధ్యక్షులు తిరువీధి మురళీ కృష్ణ, వనిత క్లబ్ అధ్యక్షులు తులసి రాధిక, ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, జిల్లా జనరల్ సెక్రటరి దేవతి లలితతో పాటు పలువురు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా సంక్రాంతి పండుగ వేడుకలను గతంలో ఎన్నడూ లేని విధంగా మొట్ట మొదటిసారిగా బద్వేలు ఆర్యవైశ్యులు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం ఎంతో సంతోషకరం అన్నారు. భావితరాలకు గుర్తుండేలా నేటి యువత అందరూ సంక్రాంతి విశిష్టతను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అనంతరం సంక్రాంతి పండుగ విశిష్టత గురించి దేవాలయ ప్రాంగణంలో గంగిరెద్దులు, ఎద్ల బండ్లుతో పాటు పలు రకాలుగా పలువురికి తెలిసేలా సంక్రాంతి గురించి వారు వివరించారు. అనంతరం సంక్రాంతి సంబరాలకు ఆర్థికంగా సహకరించిన ప్రతి ఒక్కరినీ సభా వేదికలో శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణ, అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్, తుమ్మలపెంట సురేష్‌బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, యాదాళ్ళ కృష్ణమూర్తి, శ్రీ సాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పార్టనర్స్ పత్తిరాజాగారి కృష్ణమూర్తి, పబ్బతి సత్యనారాయణ, చిందుకూరు సుధాకర్, మెంటా ప్రసాద్, కొప్పరపు సురేష్, హజరత్, చాటకొండు సత్యనారాయణ ప్రసాద్, ఉరిమి సుబ్బారావు, భార్గవ్, సుదర్శన్, సుబ్బరాజ, శివ కుమార్, సురేష్, దొంతంశెట్టి కిషోర్, సత్యా టౌన్‌షిప్ సముద్రాల సుబ్బారావు, బచ్చు సుబ్బారావు, శ్రీధర్, సుభాష్, చింతకుంట కృష్ణమూర్తి, కొప్పర్తి రాధయ్య, వైభవ్ ప్రసాద్, సూరే వెంకటసుబ్బయ్య, చీదెళ్ళ వెంకటసుబ్బయ్య, చింతకుంట కృష్ణమూర్తి, పబ్బతి చక్రపాణి, తుమ్మలపెంట జయప్రదాదేవి, ముచ్చర్ల సుజాత, దొంతంశెట్టి అనీలా దేవి, శిరీష, పబ్బతి సురేంద్ర బాబు, జూటూరు నాగరాజ, మెంటా నాగేశ్వరరావు,శ్రీదేవి, వసంతలక్ష్మీ, హైమావతి, రత్నాలు, సుధామణి, ధనలక్ష్మీ, శ్రీదేవి, కొండపల్లి లక్ష్మీతాయారమ్మ, సుగుణ,ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి

## – మున్సిపల్ ఛైర్మెన్, కమీషనర్

**బద్వేలు అర్బన్, జనవరి 16 ప్రభాతవార్త :**



సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గ స్థాయి ఓపన్ కేటగిరీ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మైదుకూరు రోడ్‌లోని స్థానిక పోస్టాఫీసు వెనుక భాగంలో నిర్వహించారు. ఈ షటిల్ టోర్నమెంట్‌లో 17 టీమ్‌లు పాల్గొని హోరాహోరీగా టోర్నమెంట్‌ను పలువురు కోచ్‌ల పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. క్రీడలలో గెలుపొందిన విజేతలకు మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డిల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం మున్సిపల్ ఛైర్మెన్, కమీషనర్‌లు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో షటిల్ టోర్నమెంటు కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో అభినందనీయం అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని, ప్రతిఒక్కరూ క్రీడలలో పాల్గొనడం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం పలువురు క్రీడాకారులను వారు అభినందించారు. షటిల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసేందుకు విచ్చేసిన మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డికి, కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డికి టీమ్ కోచ్‌లు సునీల్ కుమార్‌తో పాటు పలువురు సాదరంగా ఆహ్వానం పలికి శాలువా, పూల మాలలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మెన్ పుత్తా లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గోపాలస్వామి, కౌన్సిలర్ పుత్తా మహేష్, షటిల్ టోర్నమెంట్ కోచ్‌లు చక్రి, రామయ్య, నరసింహ, మల్లయ్య, గోగుల నరసింహ యాదవ్, చెన్నయ్య, సుబ్బయ్య, నరసింహతో పాటు పలువురు పాల్గొన్నారు.

# పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు

**వేంపల్లె, జనవరి 16, ప్రభాతవార్త :**



పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు అని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. పండుగలు మానవజీవితంలో అంతర్భాగం అన్నారు. మనుషుల మధ్య అనుబంధాలు, ఆత్మీయతలు, అనురాగాలు పెంచడంలో పండుగలు ప్రముఖపాత్ర వహిస్తాయని అన్నారు. పండుగల్లో మకర సంక్రాంతికి ప్రత్యేకత ఉందన్నారు. ఇది తెలుగువారి పెద్ద, పల్లెల పండుగ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తులసిరెడ్డి గాలిపటాలు ఎగురవేశారు.

# శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

**పులివెందుల, జనవరి 16, ప్రభాతవార్త :**



శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా ముగిశాయి. కనుమ పండుగ సందర్భంగా సోమవారం సాయంత్రం పారిశ్రామిక వేత్త కోలా ప్రసాద్, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో రాజా కళా నిలయం చిన్నారులచే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. రంగుల పండుగ సంక్రాంతి రైతుల పండుగ సంక్రాంతి, సంక్రాంతి వచ్చిందే తుమ్మెద, హరహర మహాదేవ శంభో శంకరా, తదితర పాటలకు కళాకారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుధాకర్, నృత్య శిక్షకుడు రాజా, తదితరులు పాల్గొన్నారు.

# అడా ఛైర్మెన్‌కు ఘన సత్కారం

**బద్వేలు అర్బన్, జనవరి 16 ప్రభాతవార్త :**



సంక్రాంతి పండుగ పురస్కరించుకొని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ సింగసాని గురుమోహన్, సీనియర్ న్యాయవాది పి.వి.ఎన్.ప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణతో పాటు పలువురు ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులను మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి సునీల్ కుమార్, సురేంద్ర బాబు, సురేష్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మార్కెట్ యార్డు డైరెక్టర్ మాలేపాటి సునీల్ కుమార్ మాట్లాడుతూ బద్వేలు ప్రాంతంలోని ఆర్యవైశ్యులకు ఎటువంటి సమస్య ఎదురైనా అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయడం అభినందనీయం అన్నారు. ఈ సంక్రాంతి పండుగలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బైసాని కార్తీక్, మునగా గోవిందుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మి నరసింహస్వామి పార్వేట ఉత్సవం

**పులివెందుల రూరల్, జనవరి 16, ప్రభాతవార్త :**



పులివెందులలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం లక్ష్మి నరసింహస్వామి పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కనుమను పురస్కరించుకుని వాసవి కాలనీలో వెలసిన లక్ష్మి నరసింహస్వామి ఆలయం వద్ద పార్వేట ఉత్సవం నిర్వహించారు. భక్తులు పాల పొంగులతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచారులు, ఆలయ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో నరసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు జూటూరు నాగ సుగుణాకర్‌రావు, పుల్లగూర సుధాకర్, కొప్పరపు వెంకట రమణ, మిట్టా కరుణాకర్, వెంకటేష్, ఆలయ అధ్యక్షుడు మిట్టా శ్రీహరి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్ శ్రేష్ఠి, రెండవ వార్డు కౌన్సిలర్లు మిట్టా గంగాలక్ష్మి, దొంతు రవికుమార్, మిట్టా వెంకటేశ్వరప్రసాద్, మిట్టా రామ్మోహన్‌రావు, వెంకట సుబ్బయ్య, ఎల్ఐసి చంద్రమౌళి, నాగభూషణం, సోము, సుంకు రామచంద్ర, దుద్దే పుల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా గ్రామోత్సవం

**దువ్వూరు, జనవరి 16, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను మూడు రోజుల పాటు ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. భోగి, మరకర సంక్రాంతి తరువాత సోమవారం కనుమ పండగను ప్రజలు అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వూరు, గొల్లపల్లె, గుడిపాడు,ఎడమడక తదితర గ్రామాల్లో శ్రీసీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను అలంకరించి ఊరేగించారు. దువ్వూరులో శ్రీకోదండరామస్వామి దేవస్థానానికి చెందిన ఉత్సవ విగ్రహాలను స్థానిక పోలీసుస్టేషన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు గ్రామ ప్రజలు గ్రామోత్సవం నిర్వహించారు. గొల్లపల్లె గ్రామంలో కూడా శ్రీసీతా రామ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏపీ వ్యవసాయ మండల సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. 3 రోజుల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయని ఎస్సై రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

# చంద్రబాబునాయుడును కలిసిన టిడిపి నాయకులు

**రాయచోటి టౌన్.జనవరి16 ప్రభాతవార్త**



టిడిపి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి జైలులో పెట్టడంతో వారిని పరామర్శించిన పీలేరు జైలుకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సోమవారం రాయచోటి టిడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు టిడిపి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి పీలేరు జైల్‌లో ఉంచడంతో దానిని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఛలో పీలేరు కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా రాయచోటి నాయకులు, సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల నుంచి భారీగా టిడిపి కార్యకర్తలుతో కలసి పెద్ద ఎత్తున వాహనాలలో పీలేరుకు వెళ్లారు. అనంతరం పీలేరు చేరుకుని చంద్రబాబు నాయుడు కలిసి ఆయనతో పాటు పీలేరు జైల్ వద్దకు వెళ్లి అరెస్ట్ అయిన కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు.

# ఘనంగా గోపగుడిపల్లి గుంటిగంగమ్మ తల్లిజాతర

**రామాపురం.జనవరి16 ప్రభాతవార్త**



మండలంలోని గోపగుడిపల్లి గుంటి గంగమ్మ తల్లి జాతర సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ జాతర ప్రతి సంవత్సరం కనుమ పండుగ రోజున ఆ గ్రామ ప్రజలు గంగమ్మ తల్లికి బోనాలు పట్టుకుంటారు. మొక్కుబడులు ఉన్నవారు చాందిని బండ్లతో ఊరేగిస్తారు. ఉదయం నుంచి గ్రామంలో మహిళలు ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరకు గ్రామంలో ప్రజలే కాకుండా ఇతర మండలాల నుంచి జిల్లాల నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో చాందినిబండ్ల ఊరేగింపు చేశారు.

# జగన్‌రాజు క్రికెట్ టోర్నమెంట్ విజేతలు చెర్లోపల్లె టీమ్, హర్షద్ టీమ్

## విజేతలకు 35 వేల నగదు, ట్రోఫీ

**రాజంపేట అర్బన్, జనవరి 16 ప్రభాతవార్త**



రాజంపేట నియోజకవర్గవ్యాప్తంగా తెలుగుదేశంపార్టీ సీనియర్ నేతల చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు కనుమ పండుగ సందర్భంగా బహుమతులను ప్రధానం చేశారు. రాజంపేట మండలం మందపల్లెలో జరిగిన మారమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్‌లో చెర్లోపల్లె టీమ్ విజేతగా నిలిచింది. ఈ టీమ్‌కు 35 వేల నగదు బహుమతిని జగన్‌మోహన్‌రాజు తరపున రాజంపేట మాజీ మార్కెట్‌కమిటి ఛైర్మెన్ యెద్దల విజయసాగర్ అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన మందపల్లె టీమ్‌కు 20 వేల నగదును తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి రాముయాదవ్ అందజేశారు. అలాగే నందలూరు మండలంలో జరిగిన టోర్నమెంట్‌లో స్థానిక హర్షద్‌టీమ్ విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో హర్షద్‌టీమ్, కుమ్మరపల్లె టీమ్‌లు తలపడ్డాయి. విజేత హర్షద్ టీమ్‌కు 30 వేల ఫ్రైజ్‌మనీతో పాటు ట్రోఫీని జగన్‌మోహన్‌రాజు తరపున నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ మార్కెట్‌కమిటి ఛైర్మెన్ యెద్దల విజయసాగర్‌లు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన కుమ్మరపల్లె టీమ్‌కు 20 వేల ఫ్రైజ్‌మనీ, ట్రోపీని అందజేశారు. రాజంపేట, నందలూరు మండలాల్లో మొత్తం 47 టీమ్‌లు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. పెద్దఎత్తున క్రికెట్ టీమ్‌లకు భోజన ఏర్పాట్లను కూడ జగన్‌మోహన్‌రాజు ఏర్పాటు చేశారు. మందపల్లెలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నేతలు మహ్మద్‌సొహైల్, తులసినాగేంద్ర, శివకుమార్‌రాజు, కంటా శివ, ఆర్గనైజర్‌లు నరహరి, బాలక్రిష్ణ, నందలూరు అరవపల్లెలో జరిగిన కార్యక్రమంలో తాటి సుబ్బరాయుడు, కానకుర్తి వెంకటయ్య, కుర్రా మణి, పోతురాజు మస్తానయ్య, తుంటి రమణయ్య, భువన బోయిన నరసయ్య, ఏనుగల బాలాంజనేయులు, సమ్మెట మహేష్, మాడపూరి శ్రీరాములు, తోట శివ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోదండరాముని దర్శించుకున్న యంఆర్‌కెఆర్ ఆదినేత రఘునాధరెడ్డి

**ఒంటిమిట్ట జనవరి 16 ప్రభాతవార్త:**



స్థానిక కోదండరాముని యంఆర్‌కెఆర్ సంస్థ ఆదినేత మేడా రఘునాద్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగ ఆలయ అర్చకులు ఆయనకుస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆయన స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్ధ ప్రసాదలు స్వీకరించారు. ఆంతకు ముందుగా ఒంటిమిట్టలోని రాష్ట్ర డైరక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆరోగ్య క్షేమాలను ఆడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరక్టర్ ఇరగంరెడ్డిసుబ్బారెడ్డి, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

# ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం

**ఓబులవారిపల్లె, జనవరి 16, ప్రభాతవార్త:1**



ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ వైసీపీ నాయకులు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు ఆయన తనయుడు సాయివికాస్‌రెడ్డికి బొమ్మవరం గ్రామస్థులు సంక్రాంతి పండగ సందర్భంగా ఘన స్వాగతం పలికారు. సామాజిక సేవ చేస్తూ అన్ని విధాలా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఎన్నో ఆలయాల నిర్మాణానికి నిధులు అందిస్తూ సమాజ సేవకు కృషి చేస్తున్న వారికి ఘనస్వాగతం పలికి గజమాల, శాలువాతో సత్కరించి గ్రామానికి ఆహ్వానం పలికారు. ఉప ఎంపీపీ చెంగలరాజు, సర్పంచ్ గంగరాజులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో స్వాగతం పలికి అనంతరం మణ్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, మంగంపేట వైసీపీ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దఎత్తున కనుమ సంబరాలు

**చిట్వేలి, జనవరి 16 ప్రభాతవార్త**



ఆరుగాలం శ్రమించి రైతులకు మేలు చేసే కష్టజీవులైన బసవన్నలకు పశువులకు మండలవ్యాప్తంగా సోమవారం కనుమ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా పశువులను శుభ్రంగా నీటితో శుభ్రపరిచి, కొమ్ములకు రంగులు వేసి, వివిధ పూలతో, రంగులతో పెద్దఎత్తున అలంకరించారు. పురాణశాస్త్రం ప్రకారం మహావిష్ణువు వామనవతారంలో భూమిలోకి తొక్కబడిన బలి చక్రవర్తి కనుమ పండుగ రోజు తిరిగి భూమి మీదికి వచ్చి భూమి మీద పంటలను, పాడి పశువులను రైతులు పూజించే తీరును గమనిస్తారని ఒక నమ్మకం. బలి చక్రవర్తి ఈ రోజున రథం మీద భూలోకాన్ని సంచరిస్తారని, కనుక ప్రతి ఇంటి ముందర రథచక్రాల ముగ్గును తమ ముంగిట్లో ప్రతిఒక్కరూ అలంకరించారు. కాగా ప్రతి గ్రామంలోనూ పశువలన్నింటిని చిట్లమంటలు వేసి ఒకచోటగుండా ఉత్సాహంగా పరిగెత్తించడం ఒక ఆనవాయితీ. ఈ కార్యక్రమాన్ని మండల పరిధిలోని ఎం.రాచపల్లెలో యువత అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పశువులతో గల తమ సంబంధాలను సంబరాలు రూపంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రాచపల్లె నుంచి గిరిబాబురాజు, నరసింహరాజు, సుధాకర్‌రాజు, నాగేశ్వరరాజు, వెంకటసుబ్బరాజు, రవీంద్రరాజు, రాజేంద్రరాజులు పాల్గొనగా మండలవ్యాప్తంగా మిగతా గ్రామాల నుంచి ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రికెట్ విజేత హర్షద్ జట్టు

**నందలూరు, జనవరి 16 ప్రభాతవార్త**



తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు విద్యావేత్త చమర్తి జగన్‌మోహన్‌రాజు సౌజన్యంతో నందలూరు మండలంలోని అరవపల్లె మైదానం నందు సంక్రాంతి సంబరాల్లో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠంగా ముగిసిలింది. గత 8 రోజులుగా 26 జట్లు పాల్గొని హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు ఫైనల్‌కు హర్షద్ టీమ్, కుమ్మరపల్లె టీమ్‌ల మధ్య సాగిన మ్యాచ్ మొదటలో టాస్ గెలిచి హర్షద్ టీమ్ 16 ఓవర్లకు గాను 139 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కుమ్మరపల్లె జట్టు 16 ఓవర్లకు గాను 131 పరుగులు చేయగా 8 పరుగుల తేడాతో హర్షద్ టీమ్ విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, మ్యాన్‌ఆఫ్‌ద సీరీస్‌గా యేల్చూరి శివకోటిలకు దక్కాయి. గెలిచిన జట్టుకు 30 వేల ఫ్రైజ్ మనీతో పాటు ట్రోఫీ, అలాగే ఓడిన జట్టుకు 20 వేల ఫ్రైజ్‌మనీతో పాటు ట్రోఫీలను టిడిపి రాష్ట్ర బిసిసెల్ సెక్రటరి సమ్మెట శివప్రసాద్, రాజంపేట మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ యెద్దల విజయసాగర్‌లు అందజేశారు. కార్యక్రమంలో తాటి సుబ్బరాయుడు, కానకుర్తి వెంకటయ్య, కుర్రా మణియాదవ్, పోతురాజు మస్తానయ్య, తుంటి మణయ్య, నరసయ్య, ఏనుగుల బాలాంజనేయులు, సమ్మెట మహేష్‌బాబు, మాడపూరి శ్రీరాములు, తోట శివశంకర్, సామ్రాజ్, క్రీడాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంతగాని.. పార్టీకి మీ సేవలు ఎంతో అవసరం

## పంతగానితో తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 16 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ సేవలను పంతగాని నరసింహప్రాద్ ముందుకు తీసుకెళ్లాలని తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంతగానిని ఆదేశించారు. ఈ సందర్భంగా మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రైల్వేకోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీకి మీ సేవలు ఎంతో అవసరమని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆయన పేర్కొన్నట్లు పంతగాని అన్నారు. పార్టీ కష్టకాలంలో పంతగాని నరసింహప్రసాద్ చే సిన పార్టీ సేవలు మరువరానివని అదేవిధంగా రానున్న రోజుల్లో పార్టీ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో, దళితవాడల్లో విజయవంతంగా పార్టీ సేవలను ప్రజలకు అందించాలని ఎవరైనా అడ్డగిస్తే నారా లోకేష్ వాక్ అని తెలియజేయాలని పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తెలుగుదేశంపార్టీ ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి తెలుగుదేశంపార్టీని విజయపధాన నడిపించాలని నారా లోకేష్ ఆదేశించినట్లు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. పార్టీలో ఎన్ని సమస్యలు ఉన్నా తెలుగుదేశంపార్టీని గెలిపించే బాధ్యత పంతగాని భుజాలమీద వేస్తున్నట్లు నారా లోకేష్ పేర్కొన్నారని పంతగాని అన్నారు. అనంతరం నారావారిపల్లెలోని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వగ్రామంలో నారా లోకేష్ పంతగాని కుటుంబ సభ్యులను పిలిపించి వారితో చర్చించి పార్టీ సేవలను విజయవంతంగా ఏర్పాటు చేయాలని, ఇదే తనవాక్కు అని పంతగాని అన్నారు. అనంతరం నారా లోకేష్‌బాబును కుటుంబ సభ్యులు గజమాలలతో సన్మానించి వారి ఆశయాలకు త్రికరణ సుద్ధితో పనిచేస్తానని పంతగాని నరసింహప్రసాద్ నారా లోకేష్‌కు హామీ ఇచ్చారు.

# వైభవంగా పార్వేట ఉత్సవం

**ఒంటిమిట్ట జనవరి 16 ప్రభాతవార్త:**

ఒంటిమిట్టలో సోమవారం సాయం త్రం కనుమ పండుగ సందర్భంగా జరిగిన శ్రీ కోదండరామస్వామి పారవేట ఉత్సవం వైభవంగా జరిగింది .ఆంతకు ముందుగా రామాలయంలో వేకువ జామునే ఆర్చకులువీణరాఘవాచార్యులు, శ్రావన్‌కుమార్,పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, రఘులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.తరువాత సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు.తరువా తఉత్స మూర్తులకు ప్రత్యేక ంగా ఆలంకరించారు. సాయంత్రం 5గంటలకు స్వామి వారిని తారవేట నిమిత్తం ఆలయం నుంచి స్దానిక నాగేటి తిప్ప కోండపైకి తీసుకోని పోయి కోంత సేపు వేటా కార్యక్రమం నిర్వహించారు. ఆనంతరం గ్రామ పురవీదుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కనుమ పండుగ సందర్బంగా పలు గ్రామాలల్లో ప్రజలుగొబ్బెమ్మలను ఊరేగింపు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఒ నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, సిబ్బంది గంగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సకల దేవతా స్వరూపమే గోమాత

**చిట్వేలి, జనవరి 16 ప్రభాతవార్త**



గోమాతను ప్రతినిత్యం పూజించినట్లయితే సకల దేవతలను ఆరాధించినట్లేనని చిట్వేలి రాయిపెద్ది సుబ్రమణ్యంశాస్త్రి అన్నారు. సోమవారం కనుమ పండుగ సందర్భంగా తన గోశాలలో కుటుంబ సభ్యులతో కలిసి గోవులను గొప్పగా అలంకరించి మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. గోవులోని మూత్రం, పేడ, పాలు, నెయ్యి ప్రతి ఒక్కటి మిగతా జీవులు కంటే ప్రత్యేకతను, రోగనిరోధకశక్తిని సంతరించుకుని ఉంటాయని అన్నారు. ప్రతిరోజు గోమాతను పూజించినట్లయితే సకల దేవాతామూర్తులను ఆరాధించినట్లేనని, అందరి దేవతల ప్రతిఫలం గోమాత నుంచి దక్కుతుందని అన్నారు. హిందూజాతి ప్రతి కుటుంబం వారు తప్పకుండా తమ ఇంటిలో గోవును పెంచుకోవడం అలవర్చుకోవాలని తెలియపరిచారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

# పలు సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ జన్మదిన వేడుకలు

**ప్రొద్దుటూరు జనవరి 16, ప్రభాతవార్త**



ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు పలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ధర్మల్ రోడ్డు నందు గల విశ్వ ప్రేమ వృద్ధ శరణాలయం నందు దువ్వూరు మండలం మాచన పల్లె గ్రామానికి చెందిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి నరసింహ వృద్ధులకు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం కేక్‌కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ ఈ సందర్భంగా వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారితో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, ఐదవ వార్డ్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ మునీర్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ వ్యవసాయ సలహాదారులు అంబటి కృష్ణారెడ్డి, జాతీయ బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి, చేనేత సమస్యల పరిష్కార కమిటీ సభ్యుడు బడిగింజల చంద్రమౌళి ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# బిజెపిని అణగదొక్కేందుకే టిడిపి, వైసిపి చీకటి ఒప్పందం

**ప్రొద్దుటూరు జనవరి 16, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో బిజెపి ప్రజల్లోకి వెళ్లకుండా అణగదొక్కే ప్రయ త్నంలో స్థానిక వైసిపి ఎమ్మెల్యేతో నియో జకవర్గ టిడిపి నాయకుడు చీకటి ఒప్పం దం చేసుకున్నట్లు తేటతెల్లమవుతుందని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు ఆరోపించారు ఆదివారం ఆయన తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ టిడిపి వైసిపిపై పలు ఆరోపణలు గుప్పించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వ్యతిరేక పవనాలు వేస్తున్న నేపథ్యంలో ఒకవైపు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ మరోవైపు బిజెపి రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చే ప్రయత్నం చేస్తుంటే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అందుకు భిన్నంగా టిడిపి వైసిపి మరో దారి ఎత్తుకొని చీకటి ఒప్పందం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు ఇలాంటి చర్యలతో టిడిపి దిగజారుడు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రాజుపాలెం మండల బిజెపి అధ్యక్షులు జి రామసుబ్బయ్య, బిజెపి నాయకులు వెంకటసుబ్బన్న, శరత్ బాబు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎం సుబ్బయ్య, తాటి సుబ్బారావు పాల్గొన్నారు.

# కంప్యూటర్‌లు ప్రింటర్ విద్యా సామాగ్రి పంపిణీ

**రామాపురం, జనవరి16**

**ప్రభాతవార్త**



మండలంలోని బండపల్లి పంచాయతి భయనేని హరిజవాడ వెంకటరెడ్డిగారిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్స్, ప్రింటర్‌ను పొత్తుకూరు పల్లికు చెందిన మాజీ రెస్కో ఛైర్మన్ సదిపిరాళ్ల కృష్ణారెడ్డి ఆ గ్రామ సర్పంచ్ రవిశంకర్‌రెడ్డి స్వగృహంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సంబందించిన కంప్యూటర్, ప్రింటర్‌లు శంకర్‌నారాయణ డిక్షనరీలను 350, విద్యాసామాగ్రిని పంపిణీ చేశామన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సైకిల్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ హాస్పిటల్ డా.మదన్‌మోహన్‌రెడ్డి, డా.పద్మజ, మృధుల హాస్పిటల్ డా.మృదుల, డా.కమలాకర్‌రెడ్డి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రరాజు, నరసింహులు, వై.ఎస్.ఆర్.టి.ఎఫ్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ పి.పొట్టిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.